RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 18 సెప్టెంబర్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:95

# ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు.

తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులందరికీ ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అర్పిస్తున్నాను.

తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ.

నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ.

అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించింది.

సమ్మక్క--సారలమ్మల పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వరకు... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు... అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం.

ఆ సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేకమైన స్థానం ఉంది.

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది.

కానీ అప్పటి హైదరాబాద్ రాష్ట్రం నిజాం పాలనలోనే కొనసాగింది.

తెలంగాణతో పాటు నేటి మహారాష్ట్ర, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు కూడా హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉండేవి.

నిజాం పాలనలో హైదరాబాద్ పారిశ్రామిక, వ్యవసాయ, విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించింది.

నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపును అందుకుంది.

అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణిచివేత తీవ్రంగా ఉండేది.

చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోలపరిచాయి.

భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడింది.

నిజాం ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు జరిగాయి.

మరోవైపు రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా, భూమి--భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటం ఉద్ధృతమైంది.

రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు ఈ పోరాటాలకు నాయకత్వం వహించారు.

హైదరాబాద్ ప్రజల ఆకాంక్షలు, ఉద్యమాలు, పోరాటాల నేపథ్యంలో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో ఆపరేషన్ పోలో సైనిక చర్య చేపట్టారు.

ఆపరేషన్ పోలో అనంతరం ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారు.

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది.

అది నిజాం పాలకుల అధికారం ముగిసిన రోజు మాత్రమే కాదు.

రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం.

అందుకే సెప్టెంబర్ 17ను మనం "ప్రజా పాలన దినోత్సవం"గా జరుపుకుంటున్నాం.

ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం... వారి సమస్యలకు పరిష్కారం చూపడం...

వారి హక్కులను కాపాడడం...ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. ప్రతి మనిషి ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితి కల్పించడం.

హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో విలీనమయ్యే వరకు ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు, బలిదానాలు జరిగాయి.

ఆ చరిత్ర మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది.

పాలనలో ప్రజలే కేంద్రంగా ఉండాలి... ప్రజల ఆశలు, ఆకాంక్షలే ప్రభుత్వ నిర్ణయాలకు ప్రామాణికం కావాలి.

అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం.

తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో మాత్రమే కాదు... ప్రపంచంతో పోటీ పడుతోంది.

రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం.

అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా... ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం.

ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం.

రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం.

రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం.

సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాం.

మిగతా 2 లో

# ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ

**యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం**

**'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం**

**ఎస్ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన**

**యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ**



ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది.ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ' (రా+)లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' (Flex) అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు.

ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' (FOMO) అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది.

భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు.

ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం.

సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

## డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది.

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు.ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది.

# అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తెలంగాణ...

**రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**వ్యవసాయానికి ప్రాముఖ్యత.. రైతుల సంక్షేమానికి వెన్నుదన్ను..**

**హరిత ఇంధన రాష్ట్రంగా తెలంగాణ..**

**ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు..**

**ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం..**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 17:**తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు స్థానిక పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డిప్యూటి సీఎం మాట్లాడుతూ, సెప్టెంబర్ 17న భారతదేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య పాలనలోకి అడుగుపెట్టిన తెలంగాణ 1,000 రోజుల ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం ఉద్యమించిన యోధుల వెలకట్టలేని త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం పూర్తి చేసుకున్న పాలనలో పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యతనిచ్చామని డిప్యూటీ సీఎం తెలిపారు.



మిగతా 3 లో

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

**కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు**

**సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా**

**సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ**

**అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక**




మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

# సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు



వారణాసి వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ యూపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి హాజరయ్యారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై వారణాసి-వాద్నగర్ సేవా యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా ఏపీ సీఎం చంద్రబాబు నిలిచారు.

సీఎం చంద్రబాబు తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ కు అత్యంత సన్నిహితుడు, కష్టసుఖాల్లో తన తండ్రికి తోడుగా నిలిచారంటూ కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ గతాన్ని గుర్తు చేసుకున్నారు.

ప్రజాబలం

18 సెప్టెంబర్ 2026 శుక్రవారం

# రాహుల్ బలమా... బలహీనత

రాహుల్ గాంధీది భారత రాజకీయాల్లో ఒక నిలకడ లేని గ్రాఫ్! అది కొన్ని సార్లు పైకి, మరికొన్నిసార్లు కిందకి చలిస్తూ ఉంటుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ గెలుపు అవకాశాలు సదా అనిశ్చితిలో ఉంటున్నాయి. దాని ప్రతికూల ప్రభావం 'ఇండియా కూటమి' మీద పనిచేస్తోంది. రాహుల్ ప్రాధాన్యతలు, ప్రవర్తన, మిత్రులతో సయోధ్య వంటి అంశాలు ఈ మొత్తాన్ని ప్రభావితం చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మీడియా, సెఫాలజీ సంస్థల అంచనాలకు మించి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలతో ఏర్పడ్డ 'ఇండియా కూటమి' మెరుగైన ఫలితాలు సాధించింది. దేశంలోని 16 ముఖ్య సెఫాలజీ సంస్థలు ఇండియా కూటమి సంఖ్య 150 దాటదని జోస్యం చెప్పినా, 240 స్థానాలు పొంది ఎన్‌డిఎకు గట్టి పోటీ ఇచ్చింది. 400 సీట్ల వారి కలల్ని కల్లలు చేసి, 290కి పరిమితం చేసింది. కానీ, తర్వాత జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పక్షాలు దారుణంగా దెబ్బతిన్నాయి. సానుకూల ఫలితాలకు ఆస్కారమున్న మహారాష్ట్ర, హర్యానా, బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా చతికిలపడ్డాయి. ఇందుకు ప్రధానంగా రాహుల్ (గ్రాఫ్) నిలకడలేని తనమే కాకుండా మిత్రపక్షాలతో కాంగ్రెస్ అనుసరించే అస్పష్ట వైఖరి, వ్యూహ వైఫల్యాలూ కారణమే! ఇదంతా బిజెపికి, అది నేతృత్వం వహించే ఎన్‌డిఎకి పరోక్షంగా మేలు చేస్తోంది. 'మా స్టార్ క్యాంపెయినర్ రాహుల్ గాంధీయే' అనే కొందరు బిజెపి నేతల వ్యంగ్య వ్యాఖ్యల్లోని 'హాస్యం' కన్నా వాస్తవికతే జనాల్ని ఎక్కువ ఆలోచింపజేస్తోంది. రాహుల్ గాంధీ రాజకీయ ప్రగతి సూచీ స్థిరంగా ఉండకపోవడానికి ఆయన ప్రాధాన్యతలు, ప్రవర్తనే కారణమని మేధావులు, రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తారు. 2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఎక్కువ జనాదరణతో ఉన్నారు. 2019 ఎన్నికల ముందరితో పోల్చి చూస్తే, 2024 ముందర పలు సర్వేల జనాదరణలో ప్రధాని అభ్యర్థిగా మోడీకి కొంత సమీపంలోకి రాహుల్ రాగలిగారు. అప్పటికి దేశాన్ని చుట్టేస్తూ ఆయన అడ్డంగా, పొడువుగా రెండు పాదయాత్రలు చేసి ఉన్నారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా ఎండగడుతూ పార్లమెంటులో చక్కని, ప్రభావవంతమైన ప్రసంగాలు చేస్తున్నారు. ప్రధాని మోడీకి, పారిశ్రామికవేత్త అదానీకి వీడదీయరాని బంధముందని చేసిన పార్లమెంట్ ప్రసంగం ఆకట్టుకుంది. కానీ, ఆ స్థిరత్వం 2024 ఎన్నికల తర్వాత కొనసాగలేదు. మారిన రాజకీయాల్లో నాయకుల అటెన్షన్ 24/7 గంటలు ప్రజలు ఆశిస్తున్న తరుణంలో, రాజకీయ ప్రక్రియ నుంచి రాహుల్ తరచూ 'సెలవుల'పై వెళ్లడాన్ని జనం వింతగా చూస్తున్నారు. 'ఇతనికి సీరియస్‌నెస్ లేదు' అనే వ్యాఖ్య జనంలో తరచూ వినిపిస్తోంది. భారత్‌లో పరిస్థితుల్ని ఎత్తిచూపుతూ విదేశాల్లో చేసిన విమర్శలు, వివాదాస్పద వ్యాఖ్యలు ఆయన పలుకుబడిని, నిబద్ధతని కొంత ఇరకాటంలో పెట్టాయి. ఆ క్రమంలో కిందకు జారిపోయిన రాహుల్ 'ఇమేజ్ గ్రాఫ్' ఇటీవల మళ్లీ ఊర్ధ్వముఖంగా సాగుతోంది. పాలక ఎన్‌డిఎ ఎదుర్కొన్న కొన్ని విపరిణామాలు, 'పేపర్ లీక్, 'చందాచోర్' 'జిడిపి గ్రోత్ రేట్ వివాదం' వంటి వాటిపై ప్రతికూలంగా వచ్చిన విస్తృత ప్రజాభిప్రాయం బిజెపిని ఇరుకున పెట్టడమే కాకుండా కాంగ్రెస్, దాని మిత్రపక్షాల విమర్శలకు కొంత వెయిటేజీ పెంచింది.. ఒకప్పుడు కాంగ్రెస్‌కు ఎంతో దన్నుగా ఉండి, కాలక్రమంలో, ముఖ్యంగా 2014 తర్వాత క్రమంగా దూరమైన దళితవర్గాల్ని పూర్తిగా తమవైపు తిప్పుకునే ప్రయత్నం జరుగుతోంది. 'దేశంలోనే అతిపెద్ద విపక్ష పార్టీ అధినేత (మల్లికార్జున్ ఖర్గే) కే ఈ గతిపడితే, ఇక దేశంలో సామాన్య దళితుల సంగతేమిటి?' అని రాహుల్ ప్రశ్నిస్తున్నారు. ఖర్గే పాల్గొన్న సభా వేదికను 'శుద్ధీకరణ' పేరిట ప్రక్షాళన చేసిన 'బిజెపి, ఆర్ఎస్ఎస్, దళిత వ్యతిరేక భావజాలం' అంతా ఒకటే అని ఆయన ప్రచారం చేస్తున్నారు. ఆ వరుసలోనే, మహిళా బిల్లు కంటితుడుపు చర్య చేసి, అమలును నిర్లక్ష్యం చేస్తున్న ఎన్‌డిఎది పురుషాధిక్య 'మనుస్మృతి' భావజాలమని, వారు మహిళల రిజర్వేషన్ అమలు చేయరనే వాదనను ఆయన జనంలోకి తెస్తున్నారు. 'ఛాత్రోంకీ గూంజ్' విద్యార్థులు, యువజనుల సదస్సులకు హాజరై బిగ్గరగా వారి అనుకూల స్వరం వినిపించడం ద్వారా జన్-జీ. జన్-ఆల్ఫాను ఆకట్టుకునే ప్రయత్నం రాహుల్ చేస్తున్నారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు దూరమైన యువతను, ముఖ్యంగా కొత్త ఓటర్లను ఆకట్టుకుని, తమవైపు తిప్పుకునే వ్యూహంలో భాగమిది. తమ ఒత్తిడిపై దేశంలో కులగణనకు ఎన్‌డిఎ ప్రభుత్వం సిద్ధపడినా, ఒబిసిలకు న్యాయం చేయటం లేదనే విమర్శను కాంగ్రెస్ నాయకత్వం ఎత్తుకుంది. ఒబిసిలకు తాము అనుకూలమంటూ బిజెపి చేసుకునే ప్రచారం ఉత్తిదేనని, కులగణనలో ఎస్‌సి, ఎస్‌టిల మాదిరి బిసిలకు ప్రత్యేకంగా కాలమ్ పొందుపరచకపోవడాన్ని రాహుల్ తప్పుబడుతున్నారు. టిఎంసి, ఎన్‌సిపి, డిఎంకె, ఆప్.. తదితర పక్షాలతో, వివిధ రాష్ట్రాల్లో ఇది పలు సందర్భాల్లో రుజువయింది. సానుకూల వాతావరణంలో కూడా ప్రతికూల ఎన్నికల ఫలితాలకు ఈ సఖ్యత కొరవడటమే కారణం. ఇక ముఖ్యమైన ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాద్ (ఎస్‌పి) తో కాంగ్రెస్ సఖ్యత ఎలా ఉంటుంది? అన్నది కీలకం. 2029 సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందర అసెంబ్లీ ఎన్నికలు (ఫిబ్రవరి -2027) జరగాల్సిన యుపి ఏ రకంగా చూసినా ఇండియా కూటమికి ముఖ్యమైందే! 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌ఫి (36.6% ఓటు వాటా), కాంగ్రెస్ నేతృత్వపు యుపిఎ (2.33% ఓటు వాటా) విడివిడిగా పోటీ చేసి దెబ్బతిన్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ఇండియా కూటమి, ఎస్‌పి 37, కాంగ్రెస్ 6, మొత్తం 43 ఎంపి స్థానాల (43.52% ఓటు వాటా) తో లబ్ధి పొందింది. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి వైఖరి అనుసరించనున్నారు? అన్నది కీలకం. ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్ పలు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. పిచ్‌డే- దళిత్- అల్పసంఖ్యాక్/ పిడిఎ వ్యూహం ఆయన చేతిలో అస్త్రంగా ఉంది. బలహీనవర్గాలు (పిచ్‌డే)కు తోడు 'పి' అంటే 'పండిట్' కూడా అని ఇటీవలే ఒక సభలో వివరణ ఇచ్చిన అఖిలేశ్, బ్రాహ్మణ వర్గానికి చేరువ కావాలని చూస్తున్నారు. హిందుత్వ వాదనకు ఎస్‌పి వ్యతిరేకం కాదనే భావన వచ్చేలా.. 'సనాతన ధర్మం' ఈ దేశంలో ఐక్యత సాధించిందని కితాబిచ్చారు. ఒక వేదిక నుంచి 'హనుమాన్ చాలీసా' చదివారు. 'ఇటావా' నియోజకవర్గ పరిధిలో అఖిలేష్ చైర్మన్‌గా ఉన్న ఒక ట్రస్ట్ నిర్మిస్తున్న కేదారేశ్వర్ ఆలయం 2027 ఎన్నికలకు ముందరే ప్రారంభం కానుంది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ వల్లెవేస్తున్న 'మనుస్మృతి' కాంగ్రెస్ అనుసరించే 'హిందూ వ్యతిరేక' వైఖరికి నిదర్శనమని చెప్పేందుకు బిజెపి ప్రచారాస్త్రమవుతుందా? యుపిలో ఇది అఖిలేశ్‌తో పొసగని పొత్తు వ్యూహమవుతుందా? కాంగ్రెస్ కొంచెం ఆలోచించుకోవాలి!.

# ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది.

32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1 లక్ష 72 వేల కోట్లు ఖర్చు చేశాం.

రైతుకు భూమితోనే భుక్తి... అందుకే భూ భారతి చట్టం ద్వారా భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు తీసుకొచ్చాం.

భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించాం.

5 లక్షల 94 వేల మంది రైతులకు పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ చేశాం.

కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నాం.

పాలమూరు--రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం.

తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి...ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది.

గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.

43 లక్షల కుటుంబాలకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం చేశాం.

4 లక్షల 54 వేల స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం.

మహిళా మార్టులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం.

మహిళను కేవలం లబ్ధిదారుగా కాకుండా... ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిగా నిలబెట్టాలన్నదే మా లక్ష్యం.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం.

15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం.

43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం.

మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ.31 వేల కోట్లు అందించాం.

తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది.

ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం.

ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ.22,500 కోట్లతో 4 లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేశాం.

ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించాం.

రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం.

హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించాం.

ప్రజా పాలనకు సామాజిక న్యాయం పునాది. సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయంగా చేపట్టాం.

ఆ సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించాం.

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాం.

ఫిబ్రవరి 4ను ప్రతి ఏటా "తెలంగాణ సోషల్ జస్టిస్ డే"గా జరుపుకుంటున్నాం.

సామాజిక న్యాయం అంటే మాకు నినాదం కాదు.

వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం.

అవకాశాలు తక్కువగా దక్కిన వారికి మరిన్ని అవకాశాలు కల్పించడం.

అప్పుడే సమాజం సమానంగా ముందుకు సాగుతుంది.

ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లలాంటివి.

కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం.

ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో సకల వసతులతో వీటి నిర్మాణం చేపడుతున్నాం.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించాం.

ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించేందుకు రూ.927 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

మధ్యాహ్న భోజనాన్ని 12వ తరగతి విద్యార్థుల వరకు విస్తరించాం.

11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం.

విద్యా రంగంలో తీసుకున్న చర్యలతో పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది.

ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం.

అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యా సంస్థల సమాఖ్య యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి.

ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.

రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం.

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 లక్షల 19 వేల మందికి రూ.2,526 కోట్ల సహాయం అందించాం.

సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం మొదలైంది.

సనత్‌నగర్ లో మర్రి చెన్నారెడ్డి టిమ్స్ సూపర్? స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించుకున్నాం.

అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం.

వరంగల్ లో 2 వేల పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం

తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడింది.

ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పోరాడింది. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశాం.

గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాం.

ప్రపంచం వేగంగా మారుతోంది. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతోంది.

కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది.

అందుకే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం.

ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసుకున్నాం.

ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థులు ఈరోజు క్యాంపస్? ప్లేస్?మెంట్స్ సాధిస్తున్నారు.

పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నాం.

మన యువత తెలంగాణలోనే కాదు... ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలి.

రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కూడా వేగంగా విస్తరిస్తున్నాం.

రూ.38 వేల 595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం.

ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం. అవసరమైన భూసేకరణ చేపట్టాం.

హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రారంభించాం.

55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం.

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లో సహించం.

అందుకే టీజీ సేఫ్ ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నాం .

రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్ఠం చేశాం.

యువత పెడదోవ పట్టకుండా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది

మన లక్ష్యం ఈ రోజు అవసరాలు తీర్చడమే కాదు... రేపటి తెలంగాణను నిర్మించడం.

తెలంగాణ రైజింగ్? విజన్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా సంకల్పం.

దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం.

దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీ నిర్మిస్తున్నాం.

డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తాం.

ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది.

రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ వంటి ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం.

రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్--నాగపూర్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి.

రహదారులు అభివృద్ధికి సూచిక.

గ్రామం నుంచి మండలానికి... మండలం నుంచి జిల్లాకు... జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టాం.

ఆర్ అండ్ బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ పరిధిలో రూ.6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నాం.

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది.

తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నాం.

ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలవైపు నుంచి కూడా సహకారం ఆశిస్తున్నాం

ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మీడియా సహకారం కూడా ఉండాలని కోరుతున్నా

వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు పునాదులు.

సెప్టెంబర్ 17 మనకు గతాన్ని మాత్రమే గుర్తు చేసే రోజు కాదు.

మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు.

నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక ఘట్టం.

సకల జనుల ఉద్యమం, ఎన్నో పోరాటాలు, అమరుల త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం.

ఇప్పుడు ఆ చరిత్ర, ఆ ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి.

రైతుకు భరోసా ఉండాలి...మహిళలు ఆర్థికంగా ఎదగాలి... అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి.

పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి.

యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి.

అభివృద్ధి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికీ చేరాలి.

చరిత్రను మరిచిపోం... చరిత్ర దగ్గరే ఆగిపోం...

ఆ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం.

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో... తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం.

## ప్రధాని జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

## సంస్కృతి భవన్ శిబిరాన్ని ప్రారంభించిన గవర్నర్ శివ్ ప్రసాద్ శుక్ల

దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా రెడ్ క్రాస్ ప్రత్యేక బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించింది. రాజ్ భవన్ కు సమీపంలోని సంస్కృతి భవన్లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రసాద్ శుక్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రధాని మోడీ సంపూర్ణ ఆరోగ్యంతో దేశ ప్రజలకు సేవల అందించాలని ఆకాంక్షించారు. ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న రెడ్ క్రాస్ సంస్థ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. 100 సార్లకు పైగా రక్తదానం చేసిన దాతలను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రస్తుతం 76 వేలకు పైగా ఉన్న రెడ్ క్రాస్ సంస్థ సభ్యత్వాలు లక్ష దాటేలా కృషి చేయాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంత అభివృద్ధి చెందినా రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని అన్నారు. ఇతరులను ప్రాణాపాయాల నుంచి తప్పించే రక్తాన్ని దానం చేస్తున్న ప్రతి ఒక్కరూ గొప్పవాళ్ళని అన్నారు.

# ఉపసర్పంచ్‌ల ఆత్మగౌరవాన్ని కాపాడాలి.

## ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ డిమాండ్



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 17:**సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి ఉపసర్పంచ్ ల సమావేశం గురువారం తల్లాడ మండల కేంద్రంలో జరిగింది.సత్తుపల్లి నియోజకవర్గంలో
ఉప సర్పంచ్‌లకు గ్రామ పంచాయతీలలో తగిన ప్రాధాన్యత, గౌరవం ఇవ్వాలని వారి హక్కులను కాపాడాలని తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ డిమాండ్ చేశారు.తల్లాడలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుభాషిణి అధ్యక్షతన జరిగిన సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి ఉపసర్పంచ్‌ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కొందరు సర్పంచ్‌లు ఉపసర్పంచ్‌లపై లేనిపోని ఆరోపణలు చేస్తూ,చెక్ పవర్ తొలగించాలని కలెక్టర్లు,మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వడం బాధాకరమన్నారు. ఉపసర్పంచ్‌లుగా తాము గెలిచినప్పుడే గ్రామంలో తమకు, తమ కుటుంబాలకు ఆత్మగౌరవం నిలిచిందని, అటువంటి తమను ఇప్పుడు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.గ్రామ పంచాయతీలలో వేసే శిలాఫలకాలపై ఉపసర్పంచ్‌ల పేర్లు ప్రచురించడం లేదని, సర్వసభ్య సమావేశాలకు సమాచారం ఇవ్వడం లేదని,నిర్ణయాలు, తీర్మానాల్లో సంతకాలు తీసుకోకుండా కేవలం నోట్ ఫైళ్లపై సంతకాలు పెట్టమంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు కొన్ని డిమాండ్ లను తీర్మానం చేశారు. గ్రామ పంచాయతీల సర్వసభ్య సమావేశాలకు ఉపసర్పంచ్‌లను తప్పనిసరిగా ఆహ్వానించాలి. పంచాయతీ అభివృద్ధి తీర్మానాలు మరియు అన్ని నిర్ణయాల రికార్డులలో ఉపసర్పంచ్‌ల సంతకాలు తప్పనిసరి చేయాలి.గ్రామ పంచాయతీ మండల స్థాయి సర్వసభ్య సమావేశాలకు ఉపసర్పంచ్‌లకు పిలుపునిచ్చి వారి గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించాలి. సమావేశం అనంతరం ఉపసర్పంచ్‌ల సంఘంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న నాయకులకు నూతన బాధ్యతలు అప్పగించారు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటరెడ్డి,సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా తల్లాడ హెడ్‌క్వార్టర్ ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డిని నూతనంగా నియమించి నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నూతనంగా రాష్ట్ర, నియోజకవర్గ, మండల స్థాయిల్లో ఎన్నిక కాబడిన ఉప సర్పంచ్ లకు రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, సత్కరించారు. అనంతరం సాదరంగా కమిటీలోకి ఆహ్వానించారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మందపాటి వెంకటరెడ్డి,ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఇనపనూరి సుహాసిని,సత్తుపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ కర్నాటి లక్ష్మారెడ్డి,తల్లాడ మండల అధ్యక్షులు పైడిపల్లి జగన్, కల్లూరు మండల అధ్యక్షులు ఫైళ్ళ రామకృష్ణ, నాయకులు వెంకటరెడ్డి,కృష్ణారెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు (కె.వి), ఐంజం కృష్ణార్జునరావు బాలశౌరి,చింటూ, బాబు,రాధాకృష్ణ తదితర ఉపసర్పంచ్‌లు, పెద్దలు పాల్గొన్నారు.

# అర్హులైన విద్యార్థినులందరికీ టీడీ టీకా

## మేడ్చల్ డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం సెప్టెంబర్ 18:** మేడ్చల్ మండలం కిస్తాపూర్‌లోని గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న టీడీ టీకా శిబిరాన్ని మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ గురువారం సందర్శించి పరిశీలించారు. టీకా కార్యక్రమం నిర్వహణ, విద్యార్థినుల హాజరు, అర్హుల గుర్తింపు, లబ్ధిదారుల జాబితా, టీకా రిజిస్టర్, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలను పరిశీలించారు. వ్యాక్సిన్ క్యారియర్, కోల్డ్‌చైన్ నిర్వహణ, సిరింజ్‌ల వినియోగం, టీకా వ్యర్థాల నిర్వహణపై వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన విద్యార్థినులందరికీ టీడీ టీకా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీకా వేసే ముందు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని, టీకా అనంతరం ఏవైనా అసౌకర్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు.
వ్యాక్సిన్‌లను నిర్దేశిత ఉష్ణోగ్రతలో భద్రపరచాలని, వ్యాక్సిన్ క్యారియర్‌లో కోల్డ్‌చైన్‌ను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. టీకా సీసాల గడువు తేదీ, బ్యాచ్ నంబర్లను పరిశీలించిన అనంతరమే వినియోగించాలని సూచించారు. టీకా శిబిరంలో అవసరమైన సిరింజ్‌లు, పత్తి, వ్యర్థాల సేకరణ బాక్సులు, అత్యవసర వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.

# ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు

## త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన సర్పంచ్ కోడూరి ఉమాదేవి .

## కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ విడిచి చైర్మన్ కోడూరి వీర కృష్ణ.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 17:**గొల్లగూడెం గ్రామపంచాయతీలో జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ కోడూరి ఉమాదేవి. త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ ఉమాదేవి వీరకృష్ణ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నిరసిస్తూ,రజాకారుల దౌర్జన్యలను అణచివేస్తూ,భారత సైన్యం హైదరాబాద్ రాజ్యంలో ప్రవేశించి నిజాం పోలీస్, రజాకార్ల బలగాలను అణచివేసి తెలంగాణ ప్రజల జీవితంలో కొత్త వెలుగు తీసుకొచ్చిన రోజని హైదరాబాద్ భారతదేశంలో విలీనం అయిన రోజు సందర్భంగా మనం ఈ రోజు ఈ కార్యక్రమం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని సర్పంచ్ అన్నారు.
ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు, ఆ గ్రామ విడిసి చైర్మన్ కోడూరి వీరకృష్ణ, వార్డు మెంబర్ బొగ్గుల కృష్ణ వేణి,కోడూరి దుర్గారావు, పంచాయితీ కార్యదర్శి,ఫీల్డ్ అసిస్టెంట్,స్కూల్ హెచ్ఎం,అంగన్వాడీ టీచర్స్,ఆశ వర్కర్స్ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్లలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 17,( ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జిల్లా ప్రగతిని వివరించారు.రాజన్న ఆలయం వేములవాడ ఆలయ విస్తరణకు ?390 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.



చేనేత ప్రాధాన్యం: సిరిసిల్ల నేతన్నలకు 'ఇందిరా మహిళా శక్తి' చీరల తయారీ ఆర్డర్లు ఇస్తూ ఉపాధి కల్పిస్తున్నామన్నారు. రైతు ఉ మహిళా సంక్షేమం:?370 కోట్ల రైతు రుణమాఫీ, ?500లకే గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, మహిళా సంఘాలకు ?187 కోట్ల బ్యాంక్ రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్తగా అడ్వాన్స్‌టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టులో మరోసారి ఓటుకు నోటు కేసు విచారణ

హైదరాబాద్ గురువారం నాడు సుప్రీంకోర్టు లో ఓటుకు నోటు కేసు విచారణ జరిగింది. తమపై నమోదైన కేసు కొట్టివేయాలని రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టును కోరిన విషయం తెలిసిందే. సీనియర్ లాయర్ సిద్ధార్థ్ లూథ్రా రేవంత్ రెడ్డి తరఫున వాదనలు వినిపించారు. 2015లో జరిగిన ఘటనకు 2018లో సవరించిన అవినీతి నిరోధక చట్టం వర్తించదని సుప్రీంకోర్టుకు రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది తెలిపారు. అయితే ఓటు అనేది చట్టబద్ధమైన హక్కు అని, దానిని ప్రభావితం చేసినప్పుడు అవినీతి నిరోధక చట్టం వర్తిస్తుందని న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. తదుపరి విచారణలో బీఆర్ఎస్ తరఫు న్యాయవాది వాదనలు వింటామని కేసును సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తెలంగాణ...



మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మహిళలు ఉచిత ఆర్టీసీ ప్రయాణాల ద్వారా రూ. 343.44 కోట్లు ఆదా చేసుకున్నారని వివరించారు.
రైతు భరోసా ద్వారా ఖమ్మం జిల్లాలోని 3,41,913 మంది రైతులకు రూ. 427.96 కోట్లు అందించామని, పంట రుణమాఫీ కింద 1,31,760 మంది రైతులకు రూ. 912.61 కోట్ల రుణభారం నుంచి విముక్తి కల్పించామని తెలిపారు.
గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 2.49 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 2030 నాటికి 20,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యంగా తెలంగాణను హరిత ఇంధన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.
సీతారామ ఎత్తిపోతల పథకం, పాలేరు లింక్ కాలువ, మున్నేరు-పాలేరు లింక్ కాలువ, జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఖమ్మం నగరాన్ని వరదల నుంచి రక్షించేందుకు రూ. 525.36 కోట్లతో వరద రక్షణ గోడ నిర్మిస్తున్నామన్నారు.
జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని బలోపేతం చేస్తూ ఆసుపత్రులలో అత్యాధునిక వైద్య వసతులను కల్పిస్తున్నామని తెలిపారు.
జిల్లాలో తొలి దశలో 16,597 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి రూ. 491.8 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. అలాగే పేదలకు ప్రతి నెలా ఉచిత సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీ-ఐపాస్, పీఎంఈజీపీ ద్వారా రూ. 577 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించి యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.
సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రతి కుటుంబ సంక్షేమం, ప్రతి ప్రాంత సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.
వేడుకల్లో భాగంగా పీఎంశ్రీ జెడ్పీహెచ్ ఎస్, పందిళ్లపల్లి విద్యార్థినులు ప్రదర్శించిన ప్రజాపాలన పాట, ఎంజేపీటీబీసీ, డబ్ల్యూఆర్ఈసీ, లంకపల్లి, దానవాయిగూడెం విద్యార్థినులు ప్రదర్శించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ పాట, టీజీఎస్డబ్ల్యూఆర్ఎస్, జేసీ టేకులపల్లి విద్యార్థులు ప్రదర్శించిన పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా పాటపై నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.
తెలంగాణ అమరవీరులు జర్పుల సురేష్, మీనా వేణు, వెంపటి రామకృష్ణ, ఎస్కే మహమూద్ పాషా, యన్నందుల వేణుగోపాల్ ల కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.
అనంతరం వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్డీఏ, సంక్షేమం, వైద్య ఆరోగ్య, అటవీ, విద్యా, ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ సంక్షేమం, విద్యుత్, సైబర్ నేరాలు, టీజీ ఆర్టీసీ, పౌరసరఫరాలు, మోడల్ స్కూల్స్ శాఖలచే ఏర్పాటుచేసిన స్టాళ్లను డిప్యూటీ సీఎం పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రాంమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపి ఈటల

సికింద్రాబాద్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను చేరువ చేయాలనే సంకల్పంతో... పార్లమెంట్ పరిధిలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్, తిరుమలగిరిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సందర్శించారు.
ఈ సేవా కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. సుమారు 200 మందికి పైగా ప్రజలు ఈ శిబిరంలో పాల్గొని ఉచిత వైద్య సేవలను పొందారు. ప్రధానంగా బీపీ , షుగర్ వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు, అవసరమైన వారికి ఈసీజీ (ఇఅఉ) పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. నిపుణులైన వైద్యుల సూచనల మేరకు రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన సీనియర్ సిటిజన్లు ఒకే వేదికపై ఉచిత వైద్య పరీక్షలు, ఈసీజీ సేవలతో పాటు మందులు కూడా లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రజా ఉపయోగకర కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా తీసుకువచ్చిన 'ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన' (ఎఖఓఎఖ) పథకం, 'పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యంత నాణ్యమైన మందులను తక్కువ ధరకే అందజేయాలనే గొప్ప లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయబడుతోంది. బ్రాండెడ్ మందుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్న ఈ రోజుల్లో, కార్పొరేట్ కంపెనీల మందులతో సమానమైన నాణ్యత కలిగిన జెనెరిక్ (ఉవనిఉతీఱఛ) మందులను జన ఔషధి కేంద్రాలు 50% నుండి 80% వరకు తక్కువ ధరకే అందిస్తున్నాయి. దీనివల్ల ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో (బీపీ, షుగర్, గుండె జబ్బులు మొదలైనవి) బాధపడుతున్న సామాన్యులకు మందుల ఖర్చు విపరీతంగా తగ్గి, వారి కుటుంబాలకు ఆర్థిక భారం తొలగిపోతోంది. దేశవ్యాప్తంగా వేలాది కేంద్రాల ద్వారా కోట్లాది మంది ప్రజలకు ప్రాణదాతగా నిలుస్తున్న ఈ జన ఔషధి పథకం, దేశ వైద్య రంగానికి ఒక మైలురాయిగా నిలిచిందని అన్నారు.
ప్రజల ఆరోగ్యమే నిజమైన సంపద. ఒక వ్యక్తికి సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన మందులను అందించడం ద్వారా వారి కుటుంబానికి ఎంతో మేలు చేసినట్లే. జన ఔషధి కేంద్రాల ద్వారా సామాన్యులకు తక్కువ ధరకే నాణ్యమైన మందులు అందుబాటులోకి రావడం మోదీ గారి దూరదృష్టికి నిదర్శనం. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

# నిశ్శబ్దంగా ముంచుకొస్తున్న పొగాకు ప్రమాదం

### ప్రాణాలు తీస్తున్న తగ్గేదే లేదు.
### మద్యం జూదం కంటే ప్రమాదకరం
### మొదలు పెడితే బయటపడడం కష్టం
### వ్యసనంగా యువత మైనర్లు







**చంద్రుగొండ సెప్టెంబర్ 17 ప్రజాబలం ప్రతినిధి:** –ధూమపానం ప్రాణాలు తీస్తుందని తెలిసినా ఆ వ్యసనం బారిన పడినవారు బయటపడలేకపోతున్నారు. ఈ మధ్యకాలంలో పొగ తాగడం ఫ్యాషన్ గా మారింది. పొగ తాగడం ప్రమాదమని అని తెలిసిన ఒక్కసారి ఆ మహమ్మారి వారికి అలవాటు పడితే మాన లేక పోతున్నారు. మద్యం, జూదం కంటే పొగ తాగడం ప్రమాదం చెప్పినా పెడచెవిన పెడుతున్నారు. ధూమపానానికి దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్న... ఒకటి రెండు రోజులు మానుకుని తిరిగి కొనసాగిస్తున్నారు. గుండె సంబంధమైన వ్యాధులు ఉన్నవారు సైతం తాత్కాలిక ఆపి చేస్తూ తిరిగి ఈ మహమ్మారికి బానిసల్లాగా మారుతున్నారు. ఒక్కసారి పొగ తాగడానికి నువ్వు అలవాటయితే మానడం మన చేతుల్లో ఉండదు.. తాగడం మొదలుపెట్టినప్పుడే ఆలోచించాలి ఒక్కసారి రుచి చూసారా ఇక మీరు వదిలేద్దామనుకున్న అది మిమ్మల్ని వదలదు..

పొగ తాగని వాడు దున్న పోతై పుడతాడు అనే మాట వినో.. మన అభిమాన హీరో కాలుస్తున్నాడు అనో.. ఏదో సమస్య వచ్చిందనో.. ధూమ పానం మొదలు పెట్టామా ఇక అంతే సంగతులు. ఆ తర్వాత మనం వద్దనుకున్నా కుదరదు. ధూమపానం ఎంత ప్రమాదమో అలవాటు చేసుకున్నవారు ఎటువంటి అనారోగ్యాల బారిన పడతారో పొగ తాగే ప్రతి ఒక్కరికీ తెలుసు. మద్యం వంటి వాటిని కూడా దూరంగా పెట్ట గలుగు తున్నాం గాని సిగరెట్ కాదనుకోలేకపోతు న్నామంటూ సన్నిహితుల వద్ద వాపోతున్నారు. అంతర్గత ఆందోళన ఉన్న మగవారు సిగరెట్, బీడీలు తాగుతూ సుఖం పొందుతూ ఉంటారు. ఇది మగవారికే పరిమితం కాదు. పొగతాగడానికి అలవాటు పడిన మహిళలు, యుక్త వయసులో ఉన్న పిల్లలు కూడా ఇదే ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని సర్వేలు కూడా నిర్ధారిస్తున్నాయి.

**వ్యక్తి మానసిక స్థితిపై ధూమపాన ప్రభావం**

ధూమ పానం బారిన పడినవారి మానసికస్థితి పై ధూమపాన వ్యతిరేఖ పోరాట పునరుద్దరణ అంతర్జాతీయ కమిషన్' గత ఏడాది సర్వే నిర్వహించింది. సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచ హెల్త్ ఆర్గనైజేషన్ తది తర సంస్థల గణాంకాల ప్రకారం భారతదేశం లో దాదాపు 35 కోట్లమంది 16 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు వారు ధూమపానానికి బానిసలై య్యారు. వీరిలో మహిళలు 4 శాతం ఉన్నారు. ఈ అలవాటుతో నోటి క్యాన్స ర్ వంటి వ్యాధులతో ఏడాదిలో దాదాపు 4నుంచి 5 లక్షలకు పైగా మృతి చెందుతున్నారు. ధూమపాన ప్రియుల్లో 37 శాతం మంది అలవాటును మానుకోవాలని ఆశిస్తున్నా వారి వల్ల కావడం లేదు. కేవలం 5 శాతం కంటే తక్కువ మంది మాత్రమే ఆ పని చేయగలుగుతున్నారు. ఈ వ్యసనాన్ని వదిలించుకునే వారి సంఖ్య మిగతా దేశాలవారితో పోలిస్తే భారత్ లో చాలా తక్కువ. యుక్త దశలో ఉన్న వారు వీటి బారిన పడి బయట పడలేకపోతున్నారు.

**శరీరం పై శాశ్వత ప్రభావాలు**

ధూమపానం అలవాటుతో దేహంపై శాశ్వత ప్రభావాలను గుర్తించలేక పోతారు. తల నుంచి కాలి వేలు చివర వరకు ప్రభావి తం అవుతాయి. మొదటగా చెవి, ముక్కు, గొంతు వంటి భాగాలు తమ స్వశక్తిని కోల్పోతాయి. దీంతో ఆ భాగాల్లో నికోటిన్ తో వచ్చే వ్యర్థాలు పేరుకు పోయి ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. సిగరెట్ తాగే వారి చర్మంతో పాటు, ఊపిరితిత్తులు, ఆ తరువాత గుండె దెబ్బతినడం ప్రారంభమవుతాయి. రక్తప్రసరణ క్రియ తగ్గిపోయి హార్ట్ ఎటాక్ దారితీస్తుంది. ఎముకలు బలహీన పడిపోయి తొందరగా దెబ్బతింటాయి. ఎక్కువ కాలం సిగరెట్ తాగే వారు పొట్ట క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. అదే పనిగా తాగడం వల్ల చేతులు వణకడం, చిరాకు వస్తాయి. లేని మనుషులు కనబడటం, లేని మాటలు వినబడటం, ఎక్కడో ఉన్న మనే భ్రమలో ఉండటం సమస్యలు కనబడతాయి.

**ప్రమాదకరం అని తెలిసి**

నికోటిన్ అనేది మనిషి మరణానికి ముఖ్య కారణం. సిగరెట్, బీడీ, చుట్ట, గంజాయి. తంబాకు, గుట్కా, జరదా పాను, ముక్కుతో తీసుకోవడం వల్ల శరీరానికి పొగాకును అందిస్తాం. ఇవన్ని నికోటిన్ అనే పదార్థాన్ని మన అవయ వాలకు అందించాలనే లక్ష్యంగా పని చేస్తాయి. బారిన పడుతుంటారు. కారణం నికోటిన్ శరీరానికి ఉత్తేజం కలిగిస్తుంది. ఉదాహరణకు ఒక సిగరెట్ తాగితే దాని ద్వారా ఎక్యూట్, క్రానిక్ ప్రభావాలు శరీరంపై చూపుతాయి.

పనిమీద ఏకకాలంలో శ్రద్ధ, ఆసక్తి రెండూ పెరుగుతాయి. ఆకలిని తగ్గిస్తుంది. అర గంటలో చేసే పని 20 నిముషాలు,30 నుంచి 40 నిముషాలు శరీరంపై ఉంటాయి. నికోటిన్ రక్తంలో చేరిన తర్వాత హృదయం నుంచి జరిగే రక్త ప్రసరణ మెదడుకు చేరుతుంది. మెదడులోని న్యూక్లియర్ సెంటర్ నీ ఇది ప్రభావితం చేస్తుంది. దీంతో మళ్లీ, మళ్లీ సిగరెట్ తాగాలనే కోరిక పెరుగుతుంది...

## బీమవరంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### నలుగురు అరెస్ట్.. రూ.29,600 నగదు, పేకముక్కలు, బైక్, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 17:** వేంసూరు మండలంలోని బీమవరం గ్రామ శివారులో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు వేంసూరు ఎస్ఐ పల్లెల ప్రదీప్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.



పోలీసుల వివరాల ప్రకారం.. వేంసూరుకు చెందిన వేల్పుల నవకుమార్, బీమవరానికి చెందిన కవిసెట్టి సత్యనారాయణ, గుదె వెంకటేశ్వరరావు, సత్తుపల్లి ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన కేదారి నాగయ్యను అరెస్ట్ చేశారు. మరో ఆరుగురు తోట మురళీకృష్ణ, సురేష్, జగన్నాథం రవి, దాసరి నాగరాజు, తోట శ్రీనివాసరావు తదితరులు పోలీసులను చూసి పరారైనట్లు తెలిపారు. దాడిలో 52 పేకముక్కలు, రూ. 29,600 నగదు, ఒక మోటార్‌సైకిల్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## చిన్నారి చార్లెస్‌కు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అండ..



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 17:** క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి చార్లెస్‌కు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అండగా నిలిచారు. సత్తుపల్లి 14వ వార్డులోని వాణి విద్యాలయంలో ఆరో తరగతి చదువుతున్న చార్లెస్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించారు.

ఎమ్మెల్యే సూచన మేరకు ఎండీ. కమల్ పాషా, మట్టా దయానంద్ టీం సభ్యులు చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 20 వేల నగదును అందజేశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కుటుంబ ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. చిన్నారి చార్లెస్ చికిత్సకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలుస్తూ.. "మీకు మేమున్నాం" అంటూ ఎమ్మెల్యే రాగమయి దయానంద్ భరోసా ఇవ్వడం కుటుంబ సభ్యుల్లో ధైర్యాన్ని నింపింది.

## కోవూరు లో మంత్రి లోకేష్ పర్యటన

నెల్లూరు కోవూరు మండలంలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. కోవూరులో ఏర్పాటు చేసిన తెదేపా వ్యవస్థాపకులు, యుగపురుషుడు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన తెదేపా శ్రేణులు, నాయకులు మంత్రి లోకేశ్ కు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక రుక్మిణి కల్యాణ మండపం నుంచి జాతీయ రహదారి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీతో కోవూరు వీధులన్నీ పసుపుమయంగా మారాయి. విగ్రహావిష్కరణ అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. మహానాయకుడు ఎన్టీఆర్ చూపిన మార్గంలోనే నడుస్తూ, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి : రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

### గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, అన్ని మతాల పెద్దలతో శాంతి సమావేశం

**పెద్దపల్లి/రామగుండం, సెప్టెంబర్-17, ప్రజాబలం ప్రతినిధి:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో, మత సామరస్యం, సోదరభావంతో నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని అన్ని వర్గాల మతపెద్దలు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని మతాల పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో శాంతి, సోదరభావం, పరస్పర గౌరవం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మతపెద్దలు, సమాజంలోని పెద్దలు తమ పరిధిలోని ప్రజలకు, ముఖ్యంగా యువతకు శాంతి, సంయమనం, పరస్పర గౌరవం పాటించేలా అవగాహన కల్పించాలని కోరారు. ఎక్కడైనా చిన్నపాటి సంఘటన లేదా వివాదం జరిగినప్పుడు ఆవేశానికి లోనై ఎక్కువ మందిని సమీకరించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమస్యలను ఎవరూ స్వయంగా పరిష్కరించేందుకు ప్రయత్నించకూడదన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటు ప్రాంతాల్లో ఏవైనా సమస్యలు తలెత్తినా, నిమజ్జన శోభాయాత్రకు సంబంధించి ట్రాఫిక్, రహదారులు, నిమజ్జన సమయం, విగ్రహాల సంఖ్య తదితర అంశాల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నా ముందుగానే పోలీసుల దృష్టికి






తీసుకురావాలని తెలిపారు. పరిస్థితులను పరిశీలించి అవసరమైన సమన్వయం, భద్రతా ఏర్పాట్లపై పోలీస్ శాఖ తగిన సూచనలు,చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా అన్ని మతాల విశ్వాసాలు, ప్రార్థనా స్థలాలు, ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా శోభాయాత్ర మసీదులు, ఇతర ప్రార్థనా స్థలాలు లేదా ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల మీదుగా వెళ్లే సమయంలో స్థానిక మతపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగానే సమన్వయం చేసుకోవాలని తెలిపారు. నమాజ్ సమయాలు, శోభాయాత్ర మార్గాలకు సంబంధించి ఏవైనా ప్రత్యేక అంశాలు ఉంటే ముందుగానే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, నినాదాలు చేసినా లేదా సోషల్ మీడియాలో వివాదాస్పద, అసత్య సమాచారాన్ని ప్రచారం చేసినా వెంటనే స్పందించకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆవేశపూరిత ప్రతిస్పందనల వల్ల చిన్న సమస్య పెద్ద వివాదంగా మారే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించడం పోలీస్ శాఖ ఒక్కదాని బాధ్యత కాదని, అన్ని మతాల పెద్దలు, ఉత్సవ కమిటీలు, ప్రజలు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే మత సామరస్యం, శాంతి, సోదరభావం కొనసాగుతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. డీజేలకు అనుమతులు లేవని, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉత్సవాలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు పోలీస్ శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు భీమేష్, శ్రీనివాస్, బెల్లంపల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు, ఎస్‌ఐలు మనోహర్, రాజేందర్, చంద్రశేఖర్, సంధ్యారాణి, శ్రీలత, మతపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# జలాధివాసమైన 5 వారాలకే 'సంగమేశ్వర' శిఖర దర్శనం

కర్నూలు, సెప్టెంబర్ 17 సంగమేశ్వరాలయ శిఖరం బయటపడటంతో.. ఆలయ పూజారులు జెండా కట్టి పూజలు చేశారు. ఆగస్టు 6వ తేదీ సంగమేశ్వరాలయం జలాధివాసమైంది. అయితే, నెల రోజుల తర్వాత ఆలయ శిఖరం దర్శనమిచ్చింది. ఇరవై మూడేళ్ల కాలంలో ఈసారి తక్కువగా ఐదు వారాల వ్యవధిలోనే శిఖరం కనిపించడం గమనార్హం. శ్రీశైలం జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 864 అడుగులకు చేరింది. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను నల్లమల సాగర్ జలాశయానికి తరలించడంతో సంగమేశ్వర ఆలయం జలాధివాసం నుంచి బయటకు వచ్చింది.కృష్ణా నదికి వరద నీరు చేరినప్పుడు పూర్తిగా జలాధివాసమయ్యే నంద్యాల జిల్లాలోని సంగమేశ్వరాలయం.. మళ్లీ వేసవిలోనే బయటకు వస్తుంది. కానీ, ఈ ఏడాది జలాధివాసమైన కొద్ది రోజుల్లోనే దర్శనమివ్వనుంది. ఆగస్టు 6వ తేదీ సంగమేశ్వరాలయం జలాధివాసమైన సంగతి తెలిసిందే. అయితే, నెల రోజుల తర్వాత ఆలయ శిఖరం దర్శనమిచ్చింది. ఎగువ నుంచి ప్రవాహాలు లేకపోవడం, శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కారణంగా ఆలయ శిఖరం దర్శనమిచ్చినట్లు ఆలయ పురోహితులు చెబుతున్నారుసంగమేశ్వరాలయ శిఖరం బయటపడటంతో.. ఆలయ పూజారులు జెండా కట్టి పూజలు చేశారు. జలాధివాసం అయ్యాక సాధారణంగా ఐదారు నెలలకు, అంటే వేసవి ప్రారంభంలోనే గానీ ఆలయ శిఖరం కనిపించదు. కానీ ఇప్పుడు నెల రోజుల్లోనే మళ్లీ ఆలయ శిఖరం దర్శనమిచ్చిందని పూజారులు చెబుతున్నారు. ఇరవై మూడేళ్ల కాలంలో ఈసారి తక్కువగా ఐదు వారాల వ్యవధిలోనే శిఖరం కనిపించడం గమనార్హం.శ్రీశైలం జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 864 అడుగులకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది జలాశయం పూర్తిగా నిండకపోవడం, తెలంగాణ వైపు విద్యుదుత్పత్తి చేయడం, ఏపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను నల్లమల సాగర్ జలాశయానికి తరలిస్తుండటంతో సంగమేశ్వర ఆలయం జలాధివాసం నుంచి బయటకు వచ్చింది.

ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు లేనప్పటికీ ఎగువన కురిసిన భారీ వర్షాలకు కృష్ణా నదికి వరదలు రావడంతో ఆ నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. దాంతో శ్రీశైలం జలాశయం నీటితో కళకళలాడింది. ఫలితంగా సంగమేశ్వర ఆలయం పూర్తిగా జలాధివాసం అయింది. జలాధివాసం సందర్భంగా పురోహితులు, ఆలయ అర్చకులు గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో చీర, సారె సమర్పించారు. అయితే, తిరిగి ఇప్పుడు శిఖర దర్శనం కావడంతో జెండా కట్టారు.గతేడాది జూన్ 15వ తేదీన సంగమేశ్వరస్వామి గర్భాలయంలోకి నీరు ప్రవేశించగా.. ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీన నీరు చేరింది. గతేడాది జూన్ 15న స్వామివారు జలాధివాసం కాగా.. మార్చిలో నీరు తగ్గి ఆలయం బయటపడింది. ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో ఆలయం జలాధివాసం కాగా.. కేవలం ఐదు వారాల్లోనే ఆలయ శిఖరం కనిపించడం గమనార్హం.మార్చి నెలలో కనిపించాల్సిన సంగమేశ్వర ఆలయ శిఖరం.. వర్షాకాలం పూర్తి కాకముందే కనిపించడం ఎల్‌నినో తీవ్రతకు అద్దం పడుతోంది.

ఇప్పుడే పరిస్థితి ఎలా ఉంటే వేసవిలో పరిస్థితి ఏంటి? ఎల్‌నినో తీవ్రమై వచ్చే వర్షాకాలంలో సరిగా వర్షాలు కురవకపోతే ఎలా ఉంటుందనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. జలాధివాసమైన ఐదు వారాలకే సంగమేశ్వర శిఖరం తిరిగి కనిపించడం శివయ్య భక్తులకు ఆనందం కలిగించే విషయమే అయినప్పటికీ.. భవిష్యత్తు సమస్యలకు ఇది ఓ సంకేతం కావచ్చనే భావనా వ్యక్తమవుతోంది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు శ్రీశైలం జలాల వినియోగం విషయంలో క్రమశిక్షణతో వ్యవహరించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పకపోవచ్చు

# ఫామ్ హౌస్‌లో సగానికిపైగా స్వాధీనం ఖాయం?

మెదక్, హైదరాబాద్, సెప్టెంబర్ 17, తెలంగాణ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా అత్యంత ఆసక్తికరమైన, అంతకుమించి రహస్యమైన కేంద్రం ఏదైనా ఉందంటే అది సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్. ప్రారంభంలో కొద్దిపాటి ఎకరాల విస్తీర్ణంలో, కేవలం రెండు అంతస్తుల సాధారణ గెస్ట్‌హౌస్‌తో మొదలైన ఈ వ్యవసాయ క్షేత్రం.. కాలక్రమేణా వేల మీటర్ల పొడవాటి ప్రహరీ గోడలు, పటిష్టమైన నిఘా వ్యవస్థ, అత్యాధునిక రాజభవన సముదాయాలతో ఒక అభేద్యమైన కోటలా రూపాంతరం చెందింది. పార్టీలో సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలకు సైతం కేవలం ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన షెడ్డు వరకే అనుమతి ఉంటుంది. లోపల కనుచూపు మేరలో విస్తరించి ఉన్న ఆకుపచ్చని తోటలు, నిర్మాణాల లోగుట్టు సొంత పార్టీ శ్రేణులకు కూడా చిక్కేది కాదన్నది బహిరంగ సత్యం. పాలనా పగ్గాలు చేతిలో ఉన్నప్పుడు ఫామ్‌హౌస్ కేంద్రంగా సాగిన పాలన పై నిరంతరం ఎదురుదాడి చేసిన విపక్షాలకు, అది ఎప్పుడూ ఒక ఛేదించలేని రహస్య కేంద్రంగానే మిగిలిపోయింది.ఈ సుదీర్ఘ మిస్టరీకి తెరదించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా విచారణాస్త్రం సంధించడంతో ఎర్రవల్లి కోట చుట్టూ ఉన్న పొగమంచు వీడబోతోంది. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం అసలు పరిమాణం ఎంత? అందులో కేసీఆర్ స్వయంగా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమి ఎంత? కౌలు పేరిట చేజిక్కించుకున్నది ఎంత? బినామీల పేరిట చుట్టుపక్కల విస్తరించిన భూభాగం ఎంత? అన్న లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఫామ్‌హౌస్ పరిధి సుమారు 700 ఎకరాలకు పైగా విస్తరించి ఉందని, అందులోనే ఏకంగా 340 నుంచి 388 ఎకరాల మేర అసైన్డ్, ప్రభుత్వ భూమి కలిసిపోయి ఉందన్న రేవంత్ ఆరోపణలతో అధికార యంత్రాంగం సమగ్ర భూ సర్వేకు నడుం బిగించింది. జిల్లా కలెక్టర్, రెవెన్యూ విభాగాలకు 30 రోజుల స్పష్టమైన డెడ్‌లైన్ విధించడం ఈ విచారణ తీవ్రతను స్పష్టం చేస్తోంది.ఇది కేవలం ఒక రాజకీయ నాయకుడి ఆస్తిపాస్తుల పరిశీలన మాత్రమే కాదు. ల్యాండ్ సీలింగ్ చట్టం, ధరణి పోర్టల్ సమగ్రతపై జరుగుతున్న అతిపెద్ద న్యాయ-పరిపాలనా పరీక్ష. తెలంగాణ అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక కుటుంబ యూనిట్‌కు గరిష్ట పరిమితి ఉండగా, కేసీఆర్ కుటుంబం అధికారికంగానే దాదాపు 439 ఎకరాలను ఎలా కలిగి ఉందన్న సాంకేతిక చిక్కును కాంగ్రెస్ ప్రభుత్వం లేవనెత్తుతోంది. అంతేకాకుండా, గత ప్రభుత్వ హయాంలో ధరణి ద్వారా రికార్డులను నిషేధిత జాబితా నుంచి తొలగించారా? స్థానిక రైతుల వద్ద నుంచి తీసుకున్న భూములకు చట్టబద్ధమైన బదలాయింపులు జరిగాయా? లేక అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని హద్దులు విస్తరించారా? అనే అంశాలపై డ్రోన్ సర్వేలు, పాత పహాణీల రికార్డులు పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూసే అవకాశముంది.ఒకవేళ విచారణలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణ నిజమని తేలితే, వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని దళిత, పేద వర్గాలకు పంచుతామన్న ప్రభుత్వ ప్రకటన బీఆర్ఎస్ అధినేతను ఆత్మరక్షణలోకి నెడుతుంది. ఇన్నాళ్లూ ప్రగతిశీల వ్యవసాయం , ఆధునిక సేద్యం పేరుతో ప్రచారం చేసుకున్న మోడల్ ఫామ్‌హౌస్ వెనుక అసలు కథ ఏమిటన్నది ఇప్పుడు అధికారిక డాక్యుమెంట్ల సాక్షిగా బట్టబయలు కానుంది. రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ దూకుడు అడుగుతో, దశాబ్ద కాలంగా ఎవరికీ అంతుచిక్కని కేసీఆర్ ఫామ్‌హౌస్ రహస్యాలు ప్రజాక్షేత్రంలో బట్టబయలయ్యే ఘట్టం సమీపించినట్లే కనిపిస్తోంది.

# భాగ్యనగరంలో నీటి కష్టాలు తప్పవా?

హైదరాబాద్, సెప్టెంబర్ 17, వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా గ్రేటర్ హైదరాబాద్ వాసులను భూగర్భ జలాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు నీటి వినియోగం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు నాటికి సగటు భూగర్భ జలమట్టం ఏకంగా 4.84 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం.. ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. అత్యంత దారుణంగా కుత్బుల్లాపూర్ మండలంలో నీటిమట్టాలు 39 మీటర్లకు పైగా లోతుకు పడిపోవడం గమనార్హం. గ్రేటర్ పరిధిలోని మొత్తం 73 శాతం ప్రాంతంలో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే దిగువన ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి, భూగర్భ జలాలు తిరిగి పుంజుకుంటేనే కొంత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. లేనిపక్షంలో రానున్న వేసవిలో భాగ్యనగరవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు. సెప్టెంబర్ వర్షపాతమే హైదరాబాద్ భవిష్యత్ నీటి భద్రతను నిర్ధారిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు

# మోడీ జీవితంలో అరుదైన రికార్డ్స్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, (న్యూస్ పల్స్) సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో మొదటిది ఢిల్లీతో సహా పలు రాష్ట్రాల్లో 'సేవా సంకల్ప అభియాన్' (సేవా సంకల్ప ఉద్యమం). ఈ సందర్భంగా రోడ్లు, మురుగునీటి పారుదల, విద్య, విద్యుత్ వంటి పలు ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని, ఢిల్లీలోని 'దర్భవాయి మార్గం' (కర్తవ్య మార్గం) వెంబడి 1.25 లక్షల ఆశీర్వాద దీపాలను వెలిగించారుప్రధాని మోదీ రాజకీయ జీవితం విషయానికి వస్తే, ఆయన అక్టోబర్ 2001 నుండి మే 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2014 నుండి భారతదేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2014లో లోక్‌సభ ఎన్నికలలో గెలిచి ఆయన తొలిసారి ప్రధానమంత్రి అయ్యారు. ఈ పరంపర ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి చెందిన కొన్ని ముఖ్యమైన రికార్డులు, విజయాలను పరిశీలిద్దాం.

ప్రధాని మోదీకి చెందిన 5 పెద్ద రికార్డులు:

వరుసగా అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రి రికార్డు: 2026 జూన్ 10న, ప్రధానమంత్రి మోదీ వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా పనిచేసి, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 4,398 రోజుల రికార్డును అధిగమించారు. దీంతో ఆయన అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రి అయ్యారు.

ప్రభుత్వాధినేతగా సుదీర్ఘ పదవీకాలం: 7 అక్టోబర్ 2001న నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా మొత్తం సుమారు 25 సంవత్సరాల పాటు ప్రభుత్వాధినేత పాత్రను పోషించారు.

వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికలలో విజయం: 2014 నుండి నరేంద్ర మోదీ వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికలలో తన పార్టీ, కూటమికి నాయకత్వం వహించారు. ఈ ఎన్నికల తరువాత ఆయన వరుసగా మూడవసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీంతో లోక్‌సభలో ఆయనకు ఇది వరుసగా మూడవ విజయం.

గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డు: నరేంద్ర మోదీ అక్టోబర్ 2001 నుండి మే 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఈ కాలంలో, ఆయన నాయకత్వంలో బీజేపీ రాష్ట్రంలో వరుస ఎన్నికల విజయాలను సాధించింది.

విదేశీ పురస్కారాల రికార్డు: ప్రధానమంత్రి మోదీ వివిధ దేశాల నుండి 30కి పైగా ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నారు. విదేశాల నుండి ఒక భారత ప్రధానమంత్రికి లభించిన అత్యధిక విదేశీ పురస్కారాలు ఇవే. వీటిలో సియోల్ శాంతి బహుమతి, ఫిలిప్ కోట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డు, ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డు (ఆఫ్ఘనిస్తాన్ అత్యున్నత పౌర పురస్కారం), సౌదీ అరేబియా రెండవ అత్యున్నత పౌర పురస్కారం, ఈజిప్ట్ అత్యున్నత పౌర పురస్కారం వంటివి ఉన్నాయి.

# మీనాక్షి స్థానంలో ముకుల్ వాస్నిక్

హైదరాబాద్, సెప్టెంబర్ 17, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మార్పు ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్రంగా చర్చనీయాంశమవుతోంది. ప్రస్తుతం ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్న ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ స్టడీ టూర్ నిమిత్తం లండన్ వెళ్లనుండటం, రాబోయే దాదాపు పది నెలల పాటు అందుబాటులో ఉండే అవకాశం లేకపోవడంతో ఆ స్థానాన్ని భర్తీ చేయడం ఏఐసీసీ కి అత్యవసరంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రభుత్వం నడుపుతున్నప్పటికీ.. నిత్యం ఉద్భవిస్తున్న అంతర్గత విభేదాలు, వర్గపోరు, మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నూతన ఇన్‌ఛార్జ్ ఎంపికపై హైకమాండ్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది.మీనాక్షి నటరాజన్ స్థానంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ దళిత నేత ముకుల్ వాస్నిక్ పేరు చాలా ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చింది. మహారాష్ట్రకు చెందిన ముకుల్ వాస్నిక్ రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మాజీ మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ అనుభవం కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఎన్ఎస్‌యూఐ , యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో పాటు.. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి అనేక సంక్లిష్ట రాష్ట్రాల్లో పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ఎలాంటి వివాదాలు లేకుండా పని చేసిన ట్రాక్ రికార్డు ఆయనకుంది.తెలంగాణ వంటి రాజకీయంగా అత్యంత సున్నితమైన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం ఒక ట్రబుల్ షూటర్ అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని వర్గానికి, అలాగే పార్టీలోని పాత కాంగ్రెస్ సీనియర్ నాయకులకు మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరును సమర్థవంతంగా సద్దుమణిగేలా చేయడం కొత్త ఇన్‌ఛార్జ్‌కు మొదటి సవాలు. ముకుల్ వాస్నిక్‌కు తెలంగాణలోని దాదాపు అందరు సీనియర్ నాయకులతో మంచి వ్యక్తిగత సంబంధాలు ఉన్నందున, ఆయన సమన్వయకర్తగా ఉంటే ఇరు వర్గాలను సమానంగా కలుపుకొని పోగలరనే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. మరొక ప్రధానమైన అంశం.. పార్టీ మరియు ప్రభుత్వం మధ్య సరైన కమ్యూనికేషన్ లేకపోవడం. నామినేటెడ్ పదవుల భర్తీ, కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు, మరియు జిల్లా స్థాయిలో కేడర్‌కు తగిన ప్రాధాన్యత లభించడం లేదనే అసంతృప్తి పాత నాయకుల్లో బలంగా ఉంది. వివాదరహిత ఇమేజ్ కలిగిన వాస్నిక్ వంటి సీనియర్ నేత బాధ్యతలు చేపడితే, ప్రభుత్వ నిర్ణయాల్లో పార్టీ ప్రాధాన్యతలను సమతుల్యం చేస్తూ సంక్షోభాలను సునాయాసంగా నివారించే అవకాశం ఉంటుంది.అంతేకాకుండా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, బిసి-దళిత అజెండాతో ముందుకు సాగుతున్న తరుణంలో.. జాతీయ స్థాయిలో సీనియర్ దళిత ముఖమైన ముకుల్ వాస్నిక్‌కు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం ద్వారా సామాజికంగా కూడా పార్టీకి కలిసొచ్చే అంశంగా మారనుంది. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో పార్టీకి తిరుగులేని విజయం అందించాలంటే పక్కా రోడ్‌మ్యాప్, సీట్ల సర్దుబాటులో పారదర్శకత అవసరం. దీనికి వాస్నిక్ అనుభవం ఎంతగానో తోడ్పడుతుందని భావిస్తున్నారు.

తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త శ్వాస ఊదేందుకు ఏఐసీసీ సిద్ధమవుతోంది. ముకుల్ వాస్నిక్ ఎంట్రీ ఖాయమైతే, రేవంత్ రెడ్డి నాయకత్వానికి, సీనియర్ల అసంతృప్తులకు మధ్య బలమైన వంతెనగా మారి పార్టీని స్థానిక పోరు వైపు విజయవంతంగా నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

# డీలిమిటేషన్ బిల్లుతో కమలానికి గులాబీ పువ్వులు

హైదరాబాద్, సెప్టెంబర్ 17, ప్రస్తుతం ఉన్న నిష్పత్తి ప్రకారం డీ లిమిటేషన్ చేస్తే తాము మద్దతిస్తామని కేటీఆర్ ప్రకటించారు. గతంలో యాభై శాతం పార్ములా వెనుక కూడా పెద్ద కుట్ర ఉందని ఆరోపించిన ఆయన ఇప్పుడు.. అదే ప్రకారం చేస్తే నిష్పత్తి మారదు కాబట్టి మద్దతు ఇస్తామన్నట్లుగా ఢిల్లీలో మీడియాకు చెబుతున్నారు. అయితే బీజేపీతో మాత్రం పొత్తు ఉండదని చెబుతున్నారు. ఓ మీడియా సంస్థ చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.బీజేపీతో తమ పార్టీ ఎలాంటి పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి జరిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేసిందని, ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదని ఆయన గుర్తుచేశారు. తమ సిద్ధాంతం , వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, భవిష్యత్తులో కూడా బీజేపీతో జతకట్టే ప్రసక్తే లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ నాయకత్వాన్ని బీజేపీ వైపు నెట్టేస్తున్నారంటూ ఆయన సోదరి కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై గట్టిగా సమాధానమివ్వలేకపోయారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలకు అంశాలవారీగా మద్దతు ఇస్తున్నామని కేటీఆర్ వివరించారు. గతంలో జీఎస్‌టి, నోట్ల రద్దు వంటి అంశాల్లో బీజేపీకి మద్దతిచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. నోట్ల రద్దుకు మద్దతివ్వడం ఒక పొరపాటని, అనుభవాల నుంచి నేర్చుకుంటామని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 21 శాతం మేర ఓట్లు తొలగించారని , ఇందులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలోనే ఓట్ల తొలగింపు జరిగిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అనర్హుల పేరిట సరైన విధానం పాటించకుండా ఓట్లను తొలగించి ఉంటే, దానికి వ్యతిరేకంగా అవసరమైతే కోర్టులను కూడా ఆశ్రయించడానికి తమ పార్టీ వెనుకాడదని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తీసుకునే ప్రజామోదయోగ్యమైన బిల్లులకు పార్లమెంట్‌లో ఉన్న తమ ముగ్గురు రాజ్యసభ ఎంపీల ద్వారా మద్దతు ఇస్తామని, కానీ రాష్ట్ర రాజకీయాల్లో మాత్రం ఆ పార్టీకి పూర్తి ప్రత్యర్థిగా ఒంటరిగానే పోరాడతామని కేటీఆర్ తమ విధానంగా చెబుతున్నారు. కానీ ఎన్నికల దగ్గరకు వచ్చే సరికి ఏం జరుగుతుందో చెప్పడం కష్టం. రాజకీయం లెక్క వేరు.

## డోర్నకల్ ఎమ్మెల్యే రామ చంద్రు నాయక్ కి తప్పిన ప్రమాదం

మహబూబాబాద్ డోర్నకల్ ఎమ్మెల్యే రామ చంద్రు నాయక్ కి ప్రమాదం తప్పింది. ఎమ్మెల్యే వాహనం లో పవర్ బ్యానీక్ పేలి కారు క్యాబిన్ లో మంటలు చెలరేగాయి. మహబూబాబాద్ లో జరిగే విమోచన దినోత్సవ జెండా కార్యక్రమానికి వెళ్తుండగా చింత పల్లి గ్రామ పరిసరాల్లో ఘటన. జరిగింది. ప్రమాదంలో డ్రైవర్ కి స్వల్ప గాయాలు అయ్యాయి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ఎమ్మెల్యేను బయటికి దింపారు. తరువాత అయన మరో వాహనంలో మహబూబాబాద్ కి పయనం అయ్యారు.

# తిరగబడ్డ గులాబీ వ్యూహం

హైదరాబాద్, సెప్టెంబర్ 17, తెలంగాణ శాసనసభ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు జరిపిన నిరసన, ఆ తదనంతరం జరిగిన ఘర్షణల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. చట్టసభల ప్రాంగణంలో ఆందోళనను తీవ్రంగా పరిగణించి, ప్రతిపక్షంపై రాజకీయ మైలేజ్ సాధించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగింది. బీఆర్ఎస్ అగ్రనేతలపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయడం, చివరికి మాజీ మంత్రి కేటీఆర్ పిఏ మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేష్‌లను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణ పేరుతో గంటల తరబడి హాజరుపరచడం వరకు వ్యవహారాన్ని తీసుకెళ్లారు. అయితే, ఈ పరిణామాలను విశ్లేషిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతటి రాజకీయ ప్రయోజనాన్ని ఆశించిందో, అంతకంటే ఎక్కువ రాజకీయ ప్రతికూలతలను ఎదుర్కొనే ప్రమాదంలో పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులపై నమోదు చేసిన తీవ్రమైన కేసులు, అలాగే విచారణ ప్రక్రియ శృతిమించడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. బీఆర్ఎస్ నేతలను చట్టబద్ధంగా కట్టడి చేయాలనే ఉద్దేశం వ్యూహాత్మకమే అయినప్పటికీ, కక్షసాధింపు చర్యల స్థాయికి వ్యవహారాన్ని తీసుకెళ్లారనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్ సిబ్బందిని విచారిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ప్రవేశించి గొడవ పడటానికి యత్నించారనే వార్తలు కలకలం రేపాయి. పోలీస్ స్టేషన్ లోపలే కస్టడీలో ఉన్నవారిపై దాడికి ప్రయత్నించడం విచారకరం, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి అని కేటీఆర్ విమర్శించడంతో బీఆర్ఎస్ దీన్ని బలమైన పొలిటికల్ డిఫెన్స్ అస్త్రంగా మార్చుకోగలిగింది. విచారణాధికారులు, శాంతిభద్రతల యంత్రాంగం వైఫల్యం అని బీఆర్ఎస్ ప్రతిదాడి చేస్తోంటే, పోలీసు శాఖ మాత్రం దాడి ఆరోపణలను ఖండించి సీసీటీవీ ఆధారాలను తెరపైకి తెచ్చింది. అయినప్పటికీ, ప్రభుత్వం తమను వేధిస్తోందని చూపించే అవకాశం బీఆర్ఎస్‌కు దొరికింది. కేవలం ఒక నిరసన ఘర్షణను రాజకీయంగా వినాశకరమైన నేరం గా చిత్రీకరించబోయి, బీఆర్ఎస్ స్థానిక శ్రేణులకు సరికొత్త కసిని, సానుభూతిని కాంగ్రెస్ నాయకత్వమే అందించినట్లయింది. ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టాలనుకున్న ప్రభుత్వం, తానే సెల్ఫ్ గోల్ వేసుకుని ఆత్మరక్షణలో పడాల్సి వచ్చింది. రాజకీయాల్లో అతిగా స్పందించడం ఉద్రిక్తతలను మరింత పెంచుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులో సిట్ విచారణలు, సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ వంటి విజువల్స్ ద్వారా మీడియాలో మైలేజ్ సాధించవచ్చని భావించినా, అది కాస్తా వికటించి ప్రజాప్రతినిధుల సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నారనే అభిప్రాయానికి దారితీసింది. శాంతిభద్రతల నిర్వహణలో తమ బలాన్ని నిరూపించుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాలకు మైలేజ్ ఇచ్చేలా ప్రవర్తించడం వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఘటనను ఆసరాగా చేసుకుని ప్రతిపక్షం నోళ్లు మూయించాలనే కాంగ్రెస్ ప్రయత్నం, బీఆర్ఎస్‌కు తమ క్యాడర్‌ను తిరిగి సమీకరించుకోవడానికి ఒక మంచి అవకాశాన్ని ఇచ్చింది. ఈ ఓవర్ యాక్షన్ మూలంగా రాజకీయ లాభం కంటే కాంగ్రెస్ పార్టీ నష్టపోయే ప్రమాదమే ఎక్కువగా కనిపిస్తోంది. తక్షణమే ఈ వ్యవహారాన్ని సమర్థవంతంగా సద్దుమణిగేలా చేయకపోతే, రాబోయే రోజుల్లో ప్రతిపక్షాల సానుభూతి వేవ్‌కు కాంగ్రెస్ సమాధానం చెప్పుకోవాల్సి ఉంది.

# పీచే మూడ్ లో రెబల్ గులాబీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17, తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం హాట్ టాపిక్ గా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ అంశంపై బీఆర్ఎస్ అధిష్టానానికి సొంత కేడర్ నుంచే తీవ్రమైన వ్యతిరేకత ఎదురవుతోంది. గతంలో పార్టీ మారిన కొందరు ఎమ్మెల్యేలు తిరిగి గులాబీ గూటికి చేరుకునేందుకు ప్రయత్నిస్తుండగా, క్షేత్రస్థాయిలో ఉండే స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాత్రం వారి రాకను బలంగా అడ్డుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తమను వదిలి వెళ్లిన నాయకులకు మళ్లీ రెడ్ కార్పెట్ వేయడంపై కేడర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీలో చేరిన కొందరు ఎమ్మెల్యేలకు అక్కడ పరిస్థితులు సరిపడకపోవడంతో, వారు మళ్లీ బీఆర్ఎస్ అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇందులో భాగంగానే పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి జూలై 2024లో కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, ఇటీవల కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశానికి హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. అంతేకాకుండా కేసీఆర్‌ను తాను మోసం చేయలేనని, తనకు అన్నం పెట్టిన వ్యక్తిని మరిచిపోలేనని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సైతం కేసీఆర్‌కు మద్దతుగా మాట్లాడటం, గత నెల జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కన్నీటి పర్యంతం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలపై పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాలోచనలు జరుపుతున్నారు. పార్టీలోకి తిరిగి వస్తామంటున్న నేతలపై ఆయా నియోజకవర్గాల్లోని స్థానిక శ్రేణుల అభిప్రాయాలు తీసుకోవాలని అధిష్టానం భావించింది. ఇందులో భాగంగా పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన కార్యకర్తలు, స్థానిక నాయకులతో ప్రత్యేకంగా చర్చిస్తున్నారు. అయితే ఫిరాయింపుదారులను పార్టీలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకోవద్దని మెజారిటీ స్థానిక నాయకులు తెగేసి చెబుతున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న క్యాడర్‌ను కాదని, అవకాశవాద రాజకీయాలు చేసిన వారికి మళ్లీ ప్రాధాన్యత ఇస్తే సంస్థాగతంగా తీవ్ర నష్టం జరుగుతుందని స్థానిక నాయకులు హెచ్చరిస్తున్నారు.

ఫిరాయించిన ఎమ్మెల్యేలను చేర్చుకోవడానికి బదులుగా, నియోజకవర్గాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, కొత్త వాళ్లను తయారు చేయాలని వారు అధిష్టానానికి గట్టిగా సూచిస్తున్నారు. ఒకవైపు నేతల రాకకోసం కొందరు ప్రయత్నిస్తుంటే, మరోవైపు క్షేత్రస్థాయి నేతల వ్యతిరేకత కారణంగా బీఆర్ఎస్ అధిష్టానం ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# 22ఏ భూముల వివాదాలకు పరిష్కారం..
## 30 రోజుల్లో న్యాయం జరిగేలా చర్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17, తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న నిరుపేదల ఆస్తుల వివాదాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. సీసీఎల్ఏ, న్యాయశాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. యూఎల్‌సీ భూములు, ఆమోదిత లేఅవుట్లలో ప్రభుత్వ భూములు, సింగరేణి కోల్‌బెల్ట్, జీవో 59, జీవో 118, అసైన్డ్ భూములు, ఇందిరమ్మ ఇళ్లు, నాలా రుసుములు, అనధికార లేఅవుట్లు, లీజ్‌హోల్డ్ ఆస్తులు, భూదాన్ భూములు తదితర 12 అంశాలపై ప్రభుత్వం పరిష్కార చర్యలు ప్రకటించింది. తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో చేరిన నిరుపేదల ఆస్తుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ అంశంపై బుధవారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. 22ఏ నిషేధిత జాబితా వివాదాల పరిష్కారానికి సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఉన్నతాధికారితో హైపవర్ ఆఫీసర్స్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుపేదలకు సంబంధించిన న్యాయబద్ధమైన కేసుల్లో అన్యాయం జరగకుండా నిర్ణీత గడువుల్లో పరిష్కారం చూపుతామని తెలిపారు. భూములకు సంబంధించిన చట్టాలు, నిబంధనలు నిజాం కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు ఎలా మారాయన్న అంశాలను సీఎం రేవంత్ సభలో వివరించారు. ఈ చారిత్రక పరిణామాల నేపథ్యంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న వివిధ రకాల భూములు, ఆస్తుల సమస్యలను ప్రభుత్వం విడివిడిగా పరిశీలించనుంది. ప్రధాన అంశాలపై చర్యలు తీసుకునే ప్రతిపాదనలను వెల్లడించిందిఅర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) మిగులు భూముల విషయంలో పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలకు వర్తించేలా కొత్త విధానం తీసుకురానుంది. పాత పెండింగ్ దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులనూ ఈ విధానంలో పరిగణనలోకి తీసుకోనుంది. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ ప్రక్రియలను సమాంతరంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికారికంగా ఆమోదం పొందిన లేఅవుట్లలో ప్రభుత్వ భూములకు సంబంధించిన పెండింగ్ రిజిస్ట్రేషన్ దరఖాస్తుల పరిష్కారానికి వారం రోజుల్లో సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోని పెండింగ్ కేసుల పరిశీలనకు జిల్లా స్థాయి ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేయనుంది. జీవో 59 కింద కన్వేయన్స్ డీడ్స్ జారీ అయిన 1,22,280 దరఖాస్తులను అర్హతల ఆధారంగా తుది పరిశీలన చేయనుంది. మరో 18,590 పెండింగ్ దరఖాస్తులను కొత్త క్రమబద్ధీకరణ విధానంలో పరిష్కరించాలని నిర్ణయించింది. జీవో 118కు సంబంధించిన పెండింగ్ కేసులను పరిష్కరించి, అర్హత సాధించిన ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించనుంది. అసైన్డ్ భూముల్లో నిర్మించిన ఇళ్ల విషయంలో 1977 నాటి చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని న్యాయ సమీక్ష, విస్తృత సంప్రదింపుల అనంతరం నిర్ణయం తీసుకోనుంది. ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లు, లబ్ధిదారుల సొంత స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు సంబంధించిన అంశాలపైనా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. సొంత స్థలంలో నిర్మించిన ఇళ్లకు ఐదేళ్ల లాక్-ఇన్ గడువు పూర్తయిన తర్వాత క్రయవిక్రయాలకు అనుమతించే ప్రతిపాదనను ప్రకటించింది .ప్రైవేటు పట్టా భూముల్లో నాలా రుసుములు చెల్లించని కేసుల్లో సంబంధిత నాలా ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించే విధంగా క్రయవిక్రయాలకు మార్గం కల్పించనుంది. ప్రభుత్వ భూముల్లోని అనధికార లేఅవుట్లు, కాలనీలను కొత్త క్రమబద్ధీకరణ పథకంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. సికింద్రాబాద్ పరిధిలోని లీజ్‌హోల్డ్ ఆస్తులను ఫ్రీహోల్డ్‌గా మార్చే కేసులకు 30 రోజుల గడువులో పరిష్కారం చూపేందుకు కమిటీ ఏర్పాటు చేయనుంది. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికుల అసైన్డ్ భూములు, భూదాన్ భూములను సమగ్ర ల్యాండ్ పూలింగ్ విధానంలోకి తీసుకొచ్చే ప్రతిపాదనను కూడా ప్రభుత్వం వెల్లడించింది. ఈవిధానంద్వారా సమీకరించే వనరులను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని నిరుపేదలగృహనిర్మాణఅవసరాలకువి నియోగిం చాలనిప్రభుత్వం నిర్ణయించింది.

# కాంగ్రెస్‌కు రివర్స్ అవుతున్న అతి రాజకీయం!

హైదరాబాద్, సెప్టెంబర్ 17, రాజకీయాల్లో వ్యూహాత్మక పైచేయి సాధించడం ఎంత కళో, దక్కిన ఆ ఆధిక్యతను పదిలపరుచుకుంటూ నిలబెట్టుకోవడం అంతకంటే పెద్ద పరిపక్వత. ఎదుటి పక్షం వేసే ఎత్తులకు పైఎత్తులు వేసి ఇరుకున పెట్టినప్పుడు వచ్చే మైలేజీని హుందాగా మలుచుకోవాలి తప్ప, అత్యుత్సాహంతో అతి చేస్తే అది అంతిమంగా చెట్టుకొట్టి మీదేసుకున్న చందంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌తో సాగిస్తున్న తాజా ఘర్షణల పర్వంలో సరిగ్గా ఇదే జరుగుతోందన్న భావన వ్యక్తమవుతోంది. అసెంబ్లీ వేదికగా మొదలైన వివాదంలో బీఆర్ఎస్ స్వయంకృతాపరాధంతో ఇరుక్కుపోయి, కాంగ్రెస్‌కు అయాచితంగా భారీ పొలిటికల్ అడ్వాంటేజ్ దక్కినప్పటికీ.. ఆ తర్వాత సాగుతున్న పరిణామాలు ఆ పైచేయిని చేజేతులా పోగొట్టుకునే దిశగా సాగుతున్నాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి చేసినట్లుగా వచ్చిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ చాలా తెలివిగా దళిత ఆత్మగౌరవ పోరాటంగా మలిచింది. ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత నేతను అవమానించారంటూ అధికార పక్షం సంధించిన అస్త్రం బీఆర్ఎస్‌ను పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టింది. అసెంబ్లీలో 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్, సభలో ఆమోదించిన తీర్మానాలు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు దండోరా మోగిస్తూ సాగిన నిరసనలతో రాజకీయంగా రావాల్సినంత మైలేజ్ కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది. అసెంబ్లీ గేట్ల వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రవర్తించిన తీరు, చొక్కాలు విప్పి చేసిన ఆందోళనలు ప్రజల్లో ఆ పార్టీకి తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారాయి. ఇక్కడితో ఆగి ఉంటే.. నైతికంగా, రాజకీయంగా కాంగ్రెస్ సంపూర్ణ విజయం సాధించి ఉండేది. కానీ, అసలు సమస్య ఇక్కడే మొదలైంది. వచ్చిన రాజకీయ పైచేయిని కాపాడుకోవాల్సింది పోయి.. వ్యవహారాన్ని సాగదీసి తెగేదాకా లాగడమే కాంగ్రెస్ వ్యూహకర్తల అతిపెద్ద వైఫల్యంగా కనిపిస్తోంది. సాధారణంగా సభా ప్రాంగణంలో జరిగే నిరసనలు, వాగ్వాదాలను రాజకీయంగా ఎదుర్కోవాలి లేదా ప్రివిలేజ్ కమిటీలు, చైర్మన్, స్పీకర్ విచారణల పరిధిలో క్రమశిక్షణా చర్యలతో ముగించాలి. కానీ ఏకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయించి, ఇద్దరు ఎమ్మెల్సీలను తెల్లవారుజామునే అరెస్ట్ చేయించడం.. కేటీఆర్, హరీశ్‌రావు సహా ముఖ్య నేతలపై , పోలీసులతో ఫిర్యాదులు చేయించి కేసులు బనాయించడం ద్వారా వ్యవహారం అతి రాజకీయ పగ గా మారిపోయింది. ఒక దశ దాటిన తర్వాత చట్టపరమైన అతి దూకుడు ఎప్పుడూ ఎదురుదెబ్బే కొడుతుంది. అసెంబ్లీ ముట్టడి వెనుక పెద్ద కుట్ర ఉందని, పోలీసులను ఉద్దేశపూర్వకంగా కాలర్‌లు పట్టుకుని తోసేశారని కేసులు నమోదు చేసి కోర్టులు, రిమాండ్లు అంటూ ముందుకు వెళ్లడం వల్ల.. సహజంగానే ప్రజాక్షేత్రంలో బాధితులెవరో, వేధిస్తున్నదెవరో అనే సరిహద్దులు చెదిరిపోతాయి. రాజకీయాల్లో ప్రత్యర్థి తప్పు చేసినప్పుడు ఆ తప్పును ఎత్తిచూపి ప్రజా క్షేత్రంలో దోషిగా నిలబెట్టడం వరకే పరిమితం కావాలి. అంతేకానీ, అదే తప్పును సాకుగా తీసుకుని పోలీసు వ్యవస్థను ప్రయోగించి కక్షసాధింపులకు దిగితే.. ప్రజల్లో ప్రభుత్వ పరిపక్వతపై అనుమానాలు మొదలవుతాయి. తాము సాధించిన దళితవాద ఆధిపత్యాన్ని అరెస్టుల రూపంలో కరిగిపోకుండా కాపాడుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోందన్నది కాదనలేని సత్యం.

# నెరవేరనున్న దశాబ్దాల నాటి కల..

## నిజామాబాద్ పట్టణం చుట్టూ రూ.2500 కోట్లతో ఔటర్ రింగు రోడ్డు..!

నిజామాబాద్, సెప్టెంబర్ 17, నిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా భావిస్తున్న ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనకు మళ్లీ జీవం పోసుకుంది. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ చొరవతో ఆర్అండ్‌బీ అధికారులు తాజా అంచనాలు, భూసేకరణపై కసరత్తు ప్రారంభించారు.

ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే జాతీయ రహదారి-44 అనుసంధానం మెరుగై.. భారీ వాహనాల దారిమళ్లింపు ద్వారా నగరంలో రద్దీ తగ్గడంతో పాటు రవాణా, పారిశ్రామికాభివృద్ధి వేగవంతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. నిజామాబాద్ నగరవాసుల దశాబ్దాల కల అయిన ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు ప్రతిపాదనకు మళ్లీ కదలిక వచ్చింది. తాజాగా.. నగరపాలక సమీక్ష సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ సూచనలతో రోడ్లు, భవనాల శాఖ అధికారులు తాజా అంచనాలు, భూసేకరణ వివరాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి ఏపీలో అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలో తెరపైకి వచ్చిన ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటే ఎన్‌హెచ్-44తో అనుసంధానం ఏర్పడి, నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు పారిశ్రామిక, రవాణా రంగాలకు ఊతం లభిస్తుందని ఇందూరు ప్రజలు కోరుకుంటున్నారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదన తొలిసారి తెరపైకి వచ్చి అంచనాలు రూపొందించినప్పటికీ.. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో పురోగతి నోచుకోలేదు. నగరంలో అసంపూర్తిగా ఉన్న బైపాస్ రోడ్డు, శివారు మాధవనగర్ వద్ద ఆర్వోబీ పనుల జాప్యం నేపథ్యంలో ఓఆర్ఆర్ అంశంపై జిల్లాలో తరచూ రాజకీయ చర్చలు జరుగుతున్నా కార్యరూపం దాల్చలేదు. ఈ రింగ్ రోడ్డు ప్రాజెక్టు సాకారమైతే కామారెడ్డి, హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారి-44తో పాటు ఇతర ప్రధాన మార్గాలన్నింటికీ సజావుగా కనెక్టివిటీ లభించనుంది. దీనివల్ల పారిశ్రామిక ఉత్పత్తులు, వస్తువులు అలాగే ప్రజా రవాణా వ్యవస్థ మరింత సులభతరంగా మారనుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను ఓఆర్ఆర్ మీదుగా మళ్లించడం ద్వారా నిజామాబాద్ నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గనుంది. అంతేకాకుండా ఆర్మూర్‌తో పాటు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల వైపు రహదారి సౌలభ్యం మరింత మెరుగవుతుంది. దీనిద్వారా స్థానిక రైతులు తమ పంట ఉత్పత్తులను ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులువుగా మార్కెట్లకు తరలించుకునే అవకాశం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఈ మేరకు ఓఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి రైతుల నుంచి ఎంత మేర భూమిని సేకరించాల్సి ఉంటుందనే వివరాలపై అధికారులు తాజాగా కసరత్తు చేస్తున్నారు.

త్వరలోనే పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించి, ఆమోదం పొంది నిధులు రాబట్టేలా చర్యలు వేగవంతం చేయాలని ఇందూరు వాసులు కోరుతున్నారు.

# మహిళ దొంగ అరెస్టు

కర్నూలు రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని మహిళల హ్యాండ్‌బ్యాగుల నుంచి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు చోరీ చేస్తున్న నిందితురాలిని కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి 30 తులాల బంగారు ఆభరణాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు త్రీటౌన్, ఫోర్త్‌టౌన్, మంత్రాలయం, పాణ్యం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన నాలుగు చోరీ కేసులను సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా ఛేదించినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్ నుంచి సుమారు 24 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. తిరుపతికి చెందిన బాధితురాలు అనంతపురంలో వివాహ కార్యక్రమానికి హాజరైన అనంతరం మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి దర్శనం కోసం వచ్చిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆరాధనోత్సవాల సందర్భంగా మంత్రాలయానికి రోజుకు సుమారు 50 వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో పోలీసులు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. చోరీ ఎక్కడ, ఎప్పుడు జరిగిందనే దానిపై స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు ప్రయాణించిన మార్గం, ఆమె కదలికలను పరిశీలించడంతో పాటు మంత్రాలయం మఠం పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. నేరం జరిగిన ప్రదేశాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన అదనపు సీసీ కెమెరాల ఫుటేజీలు దర్యాప్తులో కీలక ఆధారాలుగా మారాయి. వాటి ఆధారంగా అనుమానితురాలిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు వెల్లడైందని ఎస్పీ తెలిపారు.

## మడగూడ గ్రామపంచాయతీలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

మడగూడ: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మడగూడ గ్రామపంచాయతీ ఆవరణంలో గురువారం జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈసం సురేష్ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ విమోచన పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ అధ్యక్షులు, ఞా, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక ఆళ్ల నాని

## ఆళ్ల నాని కుటుంబానికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటాం

## ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన మంత్రి నారా లోకేష్

ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ఒక మంచి వ్యక్తిని కోల్పోయిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఉపముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) పార్థివదేహానికి మంత్రి నారా లోకేష్ ఘన నివాళు లర్పించారు. గురువారం ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేష్.. ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. "ఆళ్ల నాని మృతి బాధాకరం. ఆంధ్ర రాష్ట్రం ఒక మంచి వ్యక్తిని కోల్పోయింది. నాని అన్న మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా ఉన్నాను. సభలో అనేక అంశాలపై ఆయనతో చర్చించేవాడిని. అయితే ఏనాడూ వ్యక్తిగత విమర్శలకు వెళ్లకుండా హుందాతనంగా ఆయన వ్యవహరించేవారు" అని లోకేష్ తెలిపారు."రాజకీయాల్లో రాజనీతి ఉండాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆళ్ల నాని అన్న. వ్యక్తిగత దూషణలకు ఆయన ఎప్పుడూ దూరంగా ఉండేవారు, ప్రజలు మనకు ఇచ్చిన అవకాశాన్ని ప్రజల సమస్యల గురించి మాట్లాడేందుకే ఉపయోగించాలనే భావనతో ఆయన ఉండేవారు" అని చెప్పారు."ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా ఆళ్ల నాని సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయం. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఆరోగ్య శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకోవాలి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి ప్రజలకు సేవ చేయాలని, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి నాని అన్న" అని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సమయంలో తాను ఆయనతో చెప్పిన విషయాలను మంత్రి గుర్తుచేశారు. "ఐదు సంవత్సరాలుగా మిమ్మల్ని దగ్గరుండి చూసిన వ్యక్తిని. మీరు ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటే వ్యక్తి కాదు. క్రమశిక్షణ అనే పాఠశాల మీది. మీలాంటి వ్యక్తులు రాజకీయాల్లో నడుచుకునే తీరును చూసి మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలని చెప్పాను" అని లోకేష్ తెలిపారు. అలాంటి మంచి వ్యక్తి ఈరోజు తమ మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో ఆళ్ల నాని అంత్యక్రియలు జరుగుతున్నాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి అక్కడే ఉండి అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ తరపున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, మద్దిపాటి వెంకటరాజు, సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఏపీ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏపీఎస్ఆర్టీసీ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏపీ భవన నిర్మాణ, ఇతర నిర్మాణాల కార్పొరేషన్ చైర్మన్ వలవల బాజ్జీ తదితరులు పాల్గొన్నారు

## రివ్యూ మీటింగ్లో కలెక్టర్ - టీడీపీ ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం

పార్వతీపురం మన్యం జిల్లా జిల్లా కలెక్టరేట్లో గురువారం ఉదయం జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మధ్య వాగ్వాదం జరిగింది. మీటింగ్లో అధికారులను పలు పనుల జాప్యంనూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. అయితే చట్ట ప్రకారమే పనిచేస్తున్నారంటూ కలెక్టర్ ఆగ్రహం ప్రదర్శించారు. మాటామాటా పెరగడంతో మంత్రి సంధ్యా రాణి జోక్యంతో వివాదం సద్దు మణిగింది.

# జై బోలో గణేష్ మహారాజ్ కీ జై!

## ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్న మాజీ మంత్రి హరీష్ రావు





హైదరాబాద్ ఖైరతాబాద్ గణేష్ అంటే మన తెలంగాణలోనే కాదు, యావత్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన గణపతి ఉత్సవం. బడా గణేష్ అంటే ఖైరతాబాద్.. ఖైరతాబాద్ అంటే బడా గణేష్. బడా గణేష్ మాత్రమే కాదు.. బడియా గణేష్ కూడా. హైదరాబాద్ అంటే చార్మినార్, గోల్కొండ కోట ఎంత ప్రత్యేకమో.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ను పెంచడంలో ఖైరతాబాద్ బడా గణేష్ కూడా అంతే ప్రత్యేకమైన భాగమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.
గురువారం ఆయన ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్నారు. హరీష్ రావు మాట్లాడుతూ ఈ బడా గణేష్ను దర్శించుకోవడానికి తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారు. ఇంతటి ఘనమైన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈ ఏడాది 69 అడుగుల పంచముఖ సంకట మహాగణపతిని ప్రతిష్ఠించడం విశేషం. అంతేకాదు, మట్టితో గణపతిని తయారు చేసి పూజించడం పర్యావరణ పరిరక్షణకు చక్కటి సందేశం. భక్తి శ్రద్ధలతో మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని అన్నారు.

ఈ పంచముఖ సంకట మహాగణపతి, పంచముఖ హనుమంతుడు ప్రజలందరినీ దీవించాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా గణేష్ మండపాల నిర్వాహకులకు ఒక విజ్ఞప్తి. ఉత్సవాలు ఎంత ఘనంగా నిర్వహిస్తున్నామో.. నిమజ్జన కార్యక్రమాల్లో అంతే జాగ్రత్తలు తీసుకోవాలి. భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. నిన్న పటాన్చెరులో నిమజ్జనం సందర్భంగా జరిగిన అనుకోని ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి. ప్రజలందరూ సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు.

## తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 17-09-2026న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన అధికారిక వేడుకల్లో ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ ప్రాధాన్యతను స్మరించుకుంటూ నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ గారు పాల్గొని, ప్రజా పాలన, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ నిబద్ధతను ప్రస్తావించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన పేర్కొన్నారు. ఈ అధికారిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గారు, జిల్లా ఎస్పీ శబరీష్ గారు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డి.జానకి,




మహబూబ్ నగర్ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం జోగులాంబ జోన్?ఎఎఎ డీఐజీ కార్యాలయం, మహబూబ్నగర్ జిల్లా పోలీసు కార్యాలయం లో జిల్లా ఎస్పీ డి. జానకి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు, పోలీసు అధికారులు మరియు సిబ్బందికి తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం అందించడం, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని ఎస్పీ గారు పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి నమ్మకాన్ని మరింత బలోపేతం చేసే విధంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, వన్టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూటౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, రూరల్ సీఐ గాంధీ నాయక్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, ఆర్ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమెరికాలో యువకుడు మృతి



అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన హైదరాబాద్కు చెందిన ఓ యువకుడు అనూహ్య పరిస్థితుల్లో మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధువులను తీవ్ర విషాదంలో ముంచింది. మసాచుసెట్స్ రాష్ట్రంలోని లోవెల్ నగరంలో ఈ నెల 14న సంతోష్నగర్కు చెందిన మహమ్మద్ జాబేర్ హుస్సేన్ (27) మృతి చెందాడు. ఉన్నత విద్యను పూర్తిచేసుకుని అమెరికాలోనే ఉద్యోగం చేస్తున్న జాబేర్ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ముఖ్యంగా ఆగస్టులోనే టెక్సాస్లో వివాహం జరగడం, ఆ తర్వాత కొద్దిరోజులకే ఆయన మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్రగ్భ్భాంతికి గురయ్యారు.సంతోష్నగర్కు చెందిన జాబేర్ హుస్సేన్ విద్యాభ్యాసంలో మంచి ప్రతిభకనబరిచారు. సివిల్ ఇంజినీరింగ్ లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో 2021లో అమెరికా వెళ్లారు. మాస్టర్స్ డిగ్రీ కోసం అమెరికాలో అడుగుపెట్టిన ఆయన తొలుత కనెక్టికట్లోని విద్యాసంస్థలో చదువును కొనసాగించారు. అక్కడ తన మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసిన అనంతరం ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించారు. అనంతరం మసాచుసెట్స్ రాష్ట్రంలోని లోవెల్ నగరంలో ఉద్యోగంలో చేరారు. చదువుతో పాటు వృత్తిపరంగా కూడా స్థిరపడేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన జీవితం అనూహ్యంగా విషాదాంతమైంది.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ పై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్




హైదరాబాద్ తెలంగాణ విమోచన చరిత్రను ప్రతి పౌరుడికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే విమోచన దినోత్సవాలను నిర్వహిస్తున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సర్దార్ పటేల్ సంకల్పంవల్లే నిజాం నుండి తెలంగాణకు విమోచనం జరిగిందికొంతమంది కుహనా సెక్యులర్ వాదులు తెలంగాణలో రాజ్యమేలుతున్నారు. నిజాం పాలనలో హిందు దేవాలయాలపై దాడులు చేశారు. ఆడపిల్లలను నగ్నంగా బతకమ్మ ఆడించిన దుర్మార్గుడు నిజాం. ఎంతో మందిని చంపి రాక్షసంగా వ్యవహరించిన నీచులు రజాకార్లు. గత సీఎం కేసీఆర్, ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తురకోళ్ల ఓట్ల కోసం నిజాంను పొగుడుతున్నారు.తెలంగాణ సమాజం వీళ్లను చూసి సిగ్గు పడుతోంది. వీళ్లకు డీఎన్ఏ టెస్ట్ చేయాలినిజాం పాలనా ఆక్రుత్యాలకు పరకాల, వీరబైరాన్ పల్లి, గుండ్రాంపల్లి, వెయ్యి ఊడల మర్రిలో పోరాడి అసువులు బాశారు. నిజాం దారుణాలకు బలైన వారికి ఏం సమాధానం చెబుతారుసర్దార్ పటేల్ ముందు నిజాం తలొంచితే..కేసీఆర్, రేవంత్ రెడ్డి మాత్రం నిజాంకు సాగిలపడుతున్నారు. తెలంగాణ విమోచన చరిత్రను మతం కోణంతో చూడటం సిగ్గు చేటుఈసారి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే.. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినోత్సవాలను వారం రోజులపాటు నిర్వహిస్తాంగల్లీగల్లీలోనూ విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తాం.

# శ్రీశైలం ఇవో ఆకస్మిక పరిశీలన

కార్యనిర్వహణాధికారి . శ్రీనివాసరావు పలు ప్రదేశాలను ఆకస్మికంగా పరిశీలించారు. పాతాళగంగ స్నానఘట్టాలు, సిద్ధరామప్ప వాణిజ్య సముదాయం, పలు ప్రదేశాలలోని శౌచాలయాలు మొదలైనవాటిని కార్యనిర్వహణాధికారి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. అందుకే పాతాళగంగ పరిసరాలను, పాతాళగంగమెట్లను, ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తుండాలని పారిశుద్ధ్య విభాగపు అధికారులను ఆదేశించారు. అవసరం మేరకు పాతాళగంగ పరిసరాలలో మరియు మెట్ల మార్గంలో మరిన్ని విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. పాతాళగంగలో మరిన్ని సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని శ్రీశైలప్రభ మరియు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ బోర్డుల ఏర్పాటు శాశ్వత ప్రాతిపదికతో ఉండాలన్నారు.

అదేవిధంగా పాతాళగంగలో ప్రమాదాలు జరగకుండా వుండేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పాతాళగంగ నీటిమట్టాన్ని బట్టి ఎప్పటికప్పుడు బ్యారికేడింగును పరిశీలిస్తుండాలన్నారు. ప్రమాదాలు నిరోధించేందుకు ఏర్పాటు చేయబడిన ఈతనిపుణులు కూడా మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పాతాళగంగలోని స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులకు మరియు శౌచాలయాలకు ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాతాళగంగతో పాటు క్షేత్రపరిధిలోని అన్ని శౌచాలయాలను నిరంతరం పరిశుభ్రంగా ఉండేవిధంగా నిర్వహిస్తుండాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. శౌచాలయాలకు ఎటువంటి అంతరాయం లేకుండా నీటిసరఫరా ఉండాలని నీటిసరఫరా విభాగాన్ని ఆదేశించారు. ఆయా పరిసరాలలోని పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని ఉద్యానవన విభాగాన్ని ఆదేశించారు. ఈ విషయములో ఉద్యానవనం, పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం సిద్ధరామప్ప వాణిజ్య సముదాయాన్ని పరిశీలించారు. దుకాణసముదాయంతో పాటు పరిసరాలన్నీ కూడా పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే వాణిజ్య సముదాయం నందు చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించేవిధంగా సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

# కల్తీ ఆహారంతో ప్రజారోగ్యం ఫట్

**(హెచ్. ప్రతాప్)**

## -దిల్‌సుఖ్‌నగర్‌లో 50 కిలోల పాడైపోయిన మాంసం..

## -ఆహార భద్రతపై మరో తీవ్రమైన హెచ్చరిక

పళ్లెంలో కనిపించేది బిర్యానీ కావచ్చు. కానీ దాని వెనుక ఉన్న పదార్థాల నాణ్యతపై నమ్మకం లేకపోతే ఆ వంటకం రుచికరమైన భోజనం కాదు.. ఆరోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉంది. వినియోగదారుడు హోటల్ వంటగదిలోకి వెళ్లి మాంసం ఎప్పుడు కొనుగోలు చేశారో, ఎలా నిల్వ చేశారో, గడువు ముగిసిందో లేదో చూసుకోలేడు. అందుకే ఆహార వ్యాపారంలో నాణ్యత అనేది అదనపు లక్షణం కాదు.. అది ప్రాథమిక బాధ్యత. దిల్‌సుఖ్‌నగర్‌లో వెలుగులోకి వచ్చిన 50 కిలోల పాడైపోయిన మాంసం ఘటన ఈ బాధ్యతను మరోసారి గుర్తుచేస్తోంది.

సెప్టెంబరు 16న హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఒక ప్రముఖ కేఫ్‌లో తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ ఆధ్వర్యంలోని టీజీ–సేఫ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సుమారు 50 కిలోల పాడైపోయిన, వినియోగానికి అనర్హమైన మాంసం బయటపడింది. ఇందులో చికెన్, మటన్, రొయ్యలు ఉన్నట్లు అధికారులు, అనంతరం వెలువడిన పలు నివేదికలు పేర్కొన్నాయి. గడువు ముగిసిన ఇతర ఆహార పదార్థాలు కూడా గుర్తించారు.

స్వాధీనం చేసుకున్న పాడైన పదార్థాలను అక్కడికక్కడే తొలగించారు. మిగిలిన ఆహార నిల్వల నుంచి నమూనాలను సేకరించి అధికారిక ప్రయోగశాలకు పంపించారు. వాటి పరీక్షల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి దశలో సదరు కేఫ్ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌ను సస్పెండ్ చేయాలని అధికారులు సిఫారసు చేశారు. అదే రోజు వెలువడిన తదుపరి అధికారిక చర్యల్లో కేఫ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసిన తొమ్మిది సంస్థల్లో ఈ కేఫ్ కూడా ఉన్నట్లు వెల్లడైంది.

ఈ ఘటన ఒక్క రెస్టారెంట్‌కు పరిమితమైన విషయం కాదన్నది అదే తనిఖీల్లో బయటపడిన విస్తృత దృశ్యం చెబుతోంది. ఎల్‌బీనగర్ పరిధిలో 20 రెస్టారెంట్లు, హోటళ్లు, ఆహార తయారీ కేంద్రాలను టీజీ–సేఫ్ బృందాలు తనిఖీ చేశాయి. పాడైన లేదా కలుషితమైన మాంసం, కూరగాయలు, బొద్దింకలు, ఈగలు, ఎలుకల ఉనికి, అపరిశుభ్రమైన వంటశాలలు, సరిగా నిర్వహించని రిఫ్రిజిరేటర్లు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, శాకాహార––మాంసాహార పదార్థాలను సరిగా వేరు చేయకపోవడం వంటి లోపాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. 20 ఆహార నమూనాలను పరీక్షలకు పంపారు. తొమ్మిది సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేసి, వాటి కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశించారు. మరో ఏడు సంస్థలకు షోకాజ్ నోటీసులు, నాలుగు సంస్థలకు మెరుగుదల నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆహార భద్రతలో అత్యంత కీలకమైన అంశం నిల్వ విధానం. ముఖ్యంగా మాంసం వంటి త్వరగా పాడయ్యే పదార్థాలను తగిన ఉష్ణోగ్రతల్లో నిల్వ చేయడం, ముడి పదార్థాలను వండిన ఆహారం నుంచి వేరు చేయడం, రిఫ్రిజిరేటర్లను పరిశుభ్రంగా ఉంచడం, గడువు తేదీలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం తప్పనిసరి. పాడైన మాంసానికి సాధారణంగా రంగు మారడం, దుర్వాసన, జిగటగా మారడం వంటి లక్షణాలు కనిపించవచ్చని ఎఫ్ఎస్ఎస్ఏఐ శిక్షణా మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి.

కలుషిత ఆహారం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, వికారం, జ్వరం వంటి లక్షణాలు కనిపించవచ్చని ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాలు చెబుతున్నాయి. అయితే ఏదైనా ఆహార పదార్థం ఆరోగ్యానికి ఎంతటి ప్రభావం చూపుతుందనేది దాని కలుషిత స్థాయి, కారణమైన సూక్ష్మజీవులు, వ్యక్తి ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల భయపెట్టడం కంటే ఆహారం సురక్షితంగా ఉండేలా వ్యవస్థను కట్టుదిట్టం చేయడం ముఖ్యం.

రెస్టారెంట్ యాజమాన్యాలకు ఇక్కడ స్పష్టమైన బాధ్యత ఉంది. నాణ్యమైన ముడి పదార్థాల కొనుగోలు నుంచి సరైన నిల్వ, వంటగది పరిశుభ్రత, ఆహార నిర్వహణ, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత వరకు ప్రతి దశలో ప్రమాణాలు పాటించాలి. అదే సమయంలో అధికారులు కూడా ఒకసారి తనిఖీ చేసి ఆగిపోకుండా నిరంతర తనిఖీలు, నమూనాల పరీక్షలు, ఉల్లంఘనలపై వేగవంతమైన చర్యలు కొనసాగించాలి.

వినియోగదారుల అప్రమత్తత కూడా అంతే అవసరం. ఆహారంలో అసాధారణ వాసన, రుచి లేదా రూపం కనిపిస్తే దాన్ని తినకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఒక ఫిర్యాదు ఒక్క వినియోగదారుడినే కాదు, మరెందరో వినియోగదారులను కూడా రక్షించగలదు.

ఆహార వ్యాపారంలో లాభం ముఖ్యం కావచ్చు. కానీ లాభం కోసం నాణ్యతను తాకట్టు పెట్టే హక్కు ఎవరికీ లేదు. ఒక పళ్లెం భోజనం మన ఆకలిని తీర్చాలి.. అనారోగ్యాన్ని కాదు. దిల్‌సుఖ్‌నగర్‌లో బయటపడిన 50 కిలోల పాడైన మాంసం చెత్తకుప్పలో కలిసిపోవడంతో ఈ కథ ముగియకూడదు. అది ప్రతి హోటల్ వంటగదిలో బాధ్యతకు మేలుకొలుపు కావాలి. ఎందుకంటే వినియోగదారుడు హోటల్‌కు డబ్బు చెల్లిస్తాడు.. తన ఆరోగ్యాన్ని మాత్రం ఎప్పుడూ పణంగా పెట్టడు.

# కీసరలో రూ.5 లక్షల లంచం.. సిఐ,ఎస్ఐ అరెస్ట్




హైద్రాబాద్ సెప్టెంబర్ 17:రేషన్ బియ్యం కేసులో స్టేషన్ బెయిల్ కోసం రూ.10 లక్షలు డిమాండ్ చేశారనే ఆరోపణలపై కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డిపై కేసు నమోదైంది. కీసర చెరువు వద్ద రూ.5 లక్షలుతీసుకుంటుండ గా ఏసీబీ ఎస్ఐను పట్టుకుంది. ఇద్దరినీ అరెస్ట్ చేసి దర్యాప్తు కొనసాగిస్తోంది.లంచం తీసుకుంటూ మేడ్చల్ (D) కీసర సీఐ ఆంజనేయులు, SI జ్ఞానేందర్ రెడ్డి ~జాదీకి చిక్కడంతో స్థానికుల్లో ఆగ్రహంతో కూడిన హర్షం వ్యక్తమైంది. పోలీసుల అవినీతితో విసిగిపోయిన కీసర, పరిసర ప్రాంతాల ప్రజలు స్టేషన్ ఎదుటకు చేరుకుని బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అవినీతి ఆరోపణలతో ఖాకీ ప్రతిష్ఠ మసకబారుతున్న వేళ.. ACB చర్యపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## సెప్టెంబర్ 30లోగా డిజిటల్ పంటల సర్వే పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, సెప్టెంబర్ 17, ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో డిజిటల్ పంటల సర్వేను వేగవంతం చేసి, సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మంథని, ముత్తారం, కమాన్ పూర్, రామగిరి మండలాల డిజిటల్ పంటల సర్వేపై సంబంధిత అధికారులతో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులతో సమీక్షా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సెప్టెంబర్ 30లోగా పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ పొందేందుకు డిజిటల్ పంటల సర్వే వివరాలు కీలకమని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' వేడుకలు







**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్17: ఆగస్టు 15న దేశానికి బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం వస్తే.. సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని, అందుకే తెలంగాణ ప్రజలకు ఆగస్టు 15 ఎంత ముఖ్యమైనదో సెప్టెంబర్ 17 కూడా అంతే పవిత్రమైన, చారిత్రాత్మకమైన రోజని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు , కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ , శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) మల్క కొమరయ్య గారు, పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలు, పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజల చరిత్రలో అత్యంత పవిత్రమైన, చారిత్రాత్మకమైన రోజని కొనియాడారు. స్వాతంత్ర్యానంతరం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 550కి పైగా సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత నిర్మాణాన్ని పూర్తి చేశారని, ఆయన అకుంఠిత దీక్ష, తిరుగులేని నాయకత్వమే నేటి భారతదేశ ఐక్యతకు పునాది అని స్పష్టం చేశారు. నాటి హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలు నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రాణాలర్పించి పోరాటం చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌ను ఒక స్వతంత్ర దేశంగా ఉంచాలనే కుట్రతో నిజాం వ్యవహరించినప్పటికీ, ఉక్కుమనిషి సర్దార్ పటేల్ 'ఆపరేషన్ పోలో' ద్వారా సైనిక చర్య చేపట్టి హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసి భారత యూనియన్‌లో విలీనం చేశారని, చివరకు నిజాం నవాబు సర్దార్ పటేల్ ముందు తలవంచి లొంగిపోక తప్పలేదని తెలిపారు.

సెప్టెంబర్ 17ను 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ దశాబ్దాలుగా పోరాడుతోందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపాలని డిమాండ్ చేసిన కేసీఆర్, అధికారంలోకి వచ్చాక మజ్లిస్ (ఎంఐఎం) పార్టీకి భయపడి విమోచన దినోత్సవాన్ని పక్కనపెట్టారని విమర్శించారు. నిజాం పాలన కింద ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఈ చారిత్రక దినాన్ని ఎంతో ఘనంగా స్మరించుకుంటుంటే, తెలంగాణలో మాత్రం గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే దీనిని విమోచన దినంగా నిర్వహించడానికి వెనకాడుతున్నాయని మండిపడ్డారు.

బీజేపీ దశాబ్దాలుగా చేసిన పోరాటాలు, కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా నిర్వహించడం ప్రారంభించిన తర్వాతే... నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం' అని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజా పాలన దినోత్సవం' అని పేర్లు మార్చి వేడుకలు జరుపుకోవాల్సిన పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్ 17ను 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' అని పిలవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఎందుకు అంత భయమని ఆయన నిలదీశారు. ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవానికి 'ప్రజా వంచన' ప్రభుత్వంగా మారిందని తీవ్రంగా దుయ్యబట్టారు.

ఆగస్టు 15న దేశమంతటికీ బ్రిటీష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం లభిస్తే, సెప్టెంబర్ 17న నిజాం రాక్షస పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని, అందుకే తెలంగాణ బిడ్డలకు ఆగస్టు 15 ఎంత ప్రాముఖ్యమైనదో సెప్టెంబర్ 17 కూడా అంతే ముఖ్యమైన పండుగ రోజని పునరుద్ఘాటించారు. ఇదే శుభదినాన జన్మదినం జరుపుకుంటున్న గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ కి తెలంగాణ బీజేపీ తరపున, రాష్ట్ర ప్రజల తరపున ఆయన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## కేసీఆర్ ఫ్యామిలీ పై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం ఫైర్




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 17: కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావు రాష్ట్రానికి ద్రోహం చేసిన కుటుంబంతెలంగాణ ప్రజలను దోపిడీ చేసి రాచరిక పరిపాలన చేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు.గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ

తెలంగాణ నుండి కేసీఆర్ కుటుంబం నుండి తన్ని తరిమే రోజులు దగ్గర పడ్డాయి

2001నుండి 2014 దాకా నీళ్లు, నియామకాలు మన భూములు అన్నాడు

తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్, కేటిఆర్, హరీష్ రావుకు ఎన్ని ఆస్తులు ఉన్నాయి ప్రజలకు తెలుసు

రామోజీ రావు దగ్గర భూములు ఉన్నాయి లక్ష నాగల్లు పెట్టి దున్నిస్తా అన్నడు

ఇప్పుడు ఎక్కడ పోయాయి భూములు

అధికారం లోకి వచ్చాక తెలంగాణ సెంటిమెంట్ ను అడ్డం పెట్టుకొని దగా చేశారని విమర్శించారు.

భూముల అన్ని ఆంధ్రా వాళ్ళ దగ్గర ఉన్నాయి కేసీఆర్ అన్నాడుమీకు 100 వందల ఎకరాల భూములు ఉంటే నువ్వు,నీ చెల్లె అమెరికా పోతారా కేటిఆర్మాకు 10 నుండి ఎకరాలు భూమి ఉంది అని మా అయ్య చెప్పిండు అని కేటిఆర్ అన్నడు1932 లో మా వందల ఎకరాలు ప్రాజెక్టు లో పోతే మా నానమ్మకు లక్ష ల రూపాయలు వచ్చాయి అంటుండు

అపద్దాలు మాట్లాడితే ప్రజలు చెప్పు తో కొడతారన్నారు.

## వైద్యుడికి బెదిరింపులు

నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఔఎటా)లో విధుల్లో ఉన్న రెసిడెంట్ వైద్యుడిని రోగి బంధువులు దుర్భాషలాడుతూ, హత్య చేస్తామంటూ బెదిరించడంపై రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఖీఆం) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితులపై తక్షణమే ఈఎఖీ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి చెందిన జూనియర్ రెసిడెంట్ డాక్టర్ కె. శ్రీకాంత్ బుధవారం 1వ అంతస్తులోని ట్రయాజ్, ఎఅజల్లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఘటన చోటుచేసుకుంది. బెడ్ నంబర్ 50లోని రోగికి అత్యవసర వైద్యం అందించిన అనంతరం న్యూరాలజీ కన్సల్టేషన్, అు హెడ్ పరీక్ష చేయించాలని సూచించారు. ఈనీశ్రీవఎ ఇజీబిష్ఠవబివతీతిబజీబితినీని చేయాల్సి ఉండగా, మరో అత్యవసర కేసును వైద్యుడు పరిశీలిస్తున్నందున కొద్దిసేపు వేచి ఉండాలని బంధువులకు తెలిపారు.అనంతరం సుమారు సాయంత్రం 4.30 గంటల సమయంలో ప్రక్రియకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాలని సిబ్బందిని కోరారు. అయితే రోగి బంధువులు వైద్యుడు, డ్యూటీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తూ అసభ్యకరమైన భాషను ఉపయోగించారని ఖీఆం తెలిపింది. వైద్యుల జీతాలపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంది.ఈ క్రమంలో డాక్టర్ శ్రీకాంత్‌ను చంపేస్తానని, కత్తితో పొడుస్తానని, ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా కొడతానని బెదిరించినట్లు ఖీఆం వెల్లడించింది.

# సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమే -- పిడీఎస్ యు

## తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు
## మతోన్మాద రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలి

నల్గొండ, సెప్టెంబర్ 17,1948 సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన ఘట్టమని, అయితే తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కేవలం మతపరమైన ఘర్షణగా చిత్రీకరించడం చారిత్రక వాస్తవాలను సరళీకరించడమే అవుతుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడీఎస్ యు) స్పష్టం చేసింది.

సెప్టెంబర్ 17 సందర్భంగా నల్గొండలోని చీ.+. కాలేజీలో పిడీఎస్ యు నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిడీఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు కె. పవన్ కుమార్ పాల్గొన్నారు.




ఈ సందర్భంగా పిడీఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు కె. పవన్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటం 1946--51 కాలంలో రైతాంగ, భూసంబంధిత సమస్యలు, వెట్టి, భూస్వామ్య దోపిడీ, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన విస్తృత ప్రజా ఉద్యమంతో ముడిపడి ఉందన్నారు. తెలంగాణపై రాష్ట్ర ప్రభుత్వ విద్యా పాఠ్యాంశాల్లో కూడా వెట్టి నిర్మూలన, భూమి సమస్యలు, దేశ్‌ముఖ్‌లు--భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగ పోరాటాలు ప్రస్తావించబడ్డాయని తెలిపారు.

1948 సెప్టెంబర్‌లో హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసే ప్రక్రియలో 'ఆపరేషన్ పోలో' పేరుతో భారత సైనిక చర్యచోటుచేసుకుందని, అదే సమయంలో తెలంగాణలో కొనసాగుతున్న రైతాంగ సాయుధ పోరాటాన్ని దాని విస్తృత సామాజిక, భూసంబంధిత, రాజకీయ నేపథ్యంతో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

"తెలంగాణ సాయుధ పోరాటాన్ని కేవలం హిందూ--ముస్లిం ఘర్షణగా చిత్రీకరించడం చరిత్రను ఒక కోణానికి పరిమితం చేయడమే. ఆ పోరాటంలో భూమి, వెట్టి, పన్నులు, భూస్వామ్య దోపిడీ, రైతాంగ హక్కులు వంటి సమస్యలు కూడా కీలకంగా ఉన్నాయి" అని పవన్ కుమార్ అన్నారు.

విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రరెడ్డి వంటి భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ప్రతిఘటనలు, చాకలి ఐలమ్మ భూమి కోసం సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో ముఖ్యమైన ఘట్టాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక సమాచారంలో కూడా ఐలమ్మను భూహక్కుల పోరాటంతో, తెలంగాణ సాయుధ పోరాటంతో అనుసంధానిస్తూ ప్రస్తావించారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో పేదలు, రైతులు, కూలీలు సాధించుకున్న హక్కులు, భూమి కోసం చేసిన పోరాటాలు, వెట్టి వ్యతిరేక ఉద్యమ చరిత్రను మరుగునపరచే ప్రయత్నాలను పిడీఎస్ యు వ్యతిరేకిస్తుందని తెలిపారు. చరిత్రను ఆధారాలతో అధ్యయనం చేయాలని, చారిత్రక సంఘటనలను ప్రస్తుత రాజకీయ ప్రయోజనాల కోసం మత విద్వేషాలకు ఉపయోగించకూడదని కోరారు.

సెప్టెంబర్ 17ను ఆధారంగా చేసుకుని మతాల మధ్య విభేదాలను పెంచే రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని పవన్ కుమార్ పిలుపునిచ్చారు. చారిత్రక సంఘటనలపై భిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ, వాటిని ఆధారాలతో చర్చించడం ప్రజాస్వామ్య సమాజంలో అవసరమన్నారు.

సెప్టెంబర్ 17కు సంబంధించి 'విలీన దినం', 'విమోచన దినం', 'ప్రజా పాలన దినోత్సవం' వంటి వివిధ రాజకీయ నిర్వచనాలు ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వ అధికారిక ప్రకటనలు కూడా పేర్కొంటున్నాయి.

ప్రస్తుత తెలంగాణలో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పిడీఎస్ యు డిమాండ్ చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, విద్యార్థుల సమస్యల పరిష్కారం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వాలు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరింది.

తెలంగాణ ప్రజల హక్కుల కోసం, విద్యార్థులు--యువత సమస్యల పరిష్కారం కోసం పిడీఎస్ యు ప్రజాస్వామ్య ఉద్యమాలను కొనసాగిస్తుందని పవన్ కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో, నల్గొండ జిల్లా అధ్యక్షుడు సైదులు, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, జిల్లా నాయకులు చందు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హోమ్ గార్డ్స్ వ్యవస్థను చట్టసవరణ చేసి. ఉద్యోగ హోదా కల్పించాలి

## ప్రధాన మంత్రి నరేంద్రమోడీ జన్మదిన సందర్బంగా హోమ్ గార్డ్స్ విజ్ఞప్తి

హైద్రాబాద్ సెప్టెంబర్ 17:భారత ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన సందర్భంగా హోమ్ గార్డ్స్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు..వారి నాయకత్వం లో భారత్ మరింత అభివృద్ధి పథం లో దూసుకు పోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు...ఈ మేరకు హోమ్ గార్డ్ తరపున నారాయణ రెడ్డి ఇ వేదికగా గౌరవ మోడీకి సందేశం పంపారు. స్వచ్ఛంద సంస్థ గా ఉన్న హోమ్ గార్డ్స్ వ్యవస్థను మార్చి చట్టసవరణ చేసి. ఉద్యోగ హోదా కల్పించాలని ప్రధాన మంత్రికి హోమ్ గార్డ్స్ విజ్ఞప్తి చేశారు.

సార్! హోమ్ గార్డు వ్యవస్థ అనేది 6, డిసెంబర్, 1946లో బొంబాయిలో పౌర కల్లోలాలు మరియు మతపరమైన అల్లర్లను నియంత్రించడంలో పోలీసులకు సహాయం చేయడానికి హోమ్ గార్డులను తీసుకున్నారు. తదనంతరం, శాంతిభద్రతల పరిరక్షణకు మరియు వరదల, అగ్నిప్రమాదల నివారణ మరియు కరువులు, అత్యవసరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు పోలీసులకు సహాయకుడిగా స్వచ్ఛంద పౌరుల దళం అని పరంతి రక్షాదక్ష అని పశ్చిమ బెంగాల్ మరియు విలేజ్ గార్డ్స్ మరియు సివిక్ గార్డ్స్ కొన్ని రాష్ట్రాలు ఆమోదించాయి.

1962లో చైనా దురాక్రమణ నేపథ్యంలో కేంద్రము, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు తమ ప్రస్తుత స్వచ్ఛంద సంస్థలను ఏకం చేయాలని సూచించింది. అప్పుడు హోమ్ గార్డ్స్ గా పిలువబడే ఆల్ ఇండియా ఫోర్స్ గా ఏర్పడింది.

ఈ హోమ్ గార్డ్స్ సర్వీస్ పెరిగి, హోమ్ గార్డులు కూడా పోలీసులకు ఏమాత్రం తేడా లేకుండా పోలీసులతో సమానంగా 24 గంటలు అన్ని విధులు నిర్వహిస్తున్నాము, అలాగే అన్ని బందబస్తులు, ట్రాఫిక్ లో, నైట్ బీట్ లు మరియు అన్ని పోలీస్ విభాగాలలో పోలీస్ లతో సమాన విధి నిర్వహిస్తురు. విధి నిర్వహణలో ఎంతో మంది హోమ్ గార్డులు కూడాబలిఅయ్యారు.

నేడు! హోమ్ గార్డ్స్ వ్యవస్థ పెరిగి నేడు దేశవ్యాప్తంగా 5లక్షల చేరుకుంది. నేడు 5లక్షల హోమ్ గార్డులు కనీస సౌకర్యాలు లేక హోమ్ గార్డుల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరముగా ఉన్నది.

భారతదేశంలో హోమ్ గార్డు వ్యవస్థ ఉన్నది.



ఆ రాష్ట్రంలో ఈలా చేశారు, ఈ రాష్ట్రంలో ఇలా చేశారు, అని చెప్పుకోవడమే తప్ప, ఏ రాష్ట్రంలో కూడా హోమ్ గార్డులకు పూర్తిస్థాయిలో చేసింది లేదు. గౌరవనీయులైన ప్రధానమంత్రిగారికి గౌరవనీయులైన కేంద్ర హోంశాఖ మంత్రిగారికి నమస్కరిస్తూ, ఈ హోమ్ గార్డ్స్ వాలంటరీ అను చట్టాన్ని రద్దు చేయాలని హోమ్ గార్డ్స్ కు ఉద్యోగ హోదా కల్పించాలని మరియు హోమ్ గార్డ్స్ కు గ్రూప్-సి మరియు గ్రూప్-డి ఉద్యోగాలు ఇవ్వాలని ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాజనాల శ్రీహరికి అవకాశం ఇవ్వండి

## ఉస్మానియా కాకతీయ యూనివర్సిటీ జాక్



వరంగల్ సెప్టెంబర్ 17: వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాజనాల శ్రీహరికి అవకాశం కల్పించాలనిఉస్మానియా కాకతీయ యూనివర్సిటీ జాక్ విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు ఏ ఐ సిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ,
ప్రతిపక్ష నేత, లోక్ సభ,
రాహుల్ గాంధీ,
సోనియా గాంధీ, కె.సి. వేణుగోపాల్
న్యూఢిల్లీ
మీనాక్షి నటరాజన్ తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి
కాంగ్రెస్ ప్రదేశ్,
ఎ. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి
ాజజ అధ్యక్షులు,
మహేష్ కుమార్ గౌడ్ లకు విజ్ఞప్తి చేశారు.

మేము కాకతీయ, ఉస్మానియా యూనివర్సిటీలకు చెందిన పూర్వ, ప్రస్తుత పట్టభద్రులు, పరిశోధక విద్యార్థులం. రాబోయే వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల మీాజ ఎన్నికలలో మా బిడ్డ, మా సీనియర్ రాజనాల శ్రీహరికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని మనస్పూర్తిగా కోరుతూ ఈ లేఖ రాస్తున్నాము.

రాజనాల శ్రీహరివిశిష్టత

35 సంవత్సరాల నిర్విరామ పార్టీ సేవ

శ్రీహరి గత 35 సంవత్సరాలుగా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో ఒక సాధారణ కార్యకర్తగా చేరి, చీూఖ× నుండి నేటి వరకు పార్టీ కష్టసుఖాల్లో వెన్నంటి ఉన్నారు. పదవులు, అధికారం లేకపోయినా పార్టీ జెండాను వదలని నిఖార్సయిన కాంగ్రెస్ వాది.కాకతీయ యూనివర్సిటీ బిడ్డ - ా+ పూర్తి చేశారు.

తాను స్వయంగా కాకతీయ యూనివర్సిటీలోనే ా+ (పోస్ట్ గ్రాడ్యుయేషన్) పూర్తి చేసినారు కాబట్టి పట్టభద్రుల సమస్యలు, యూనివర్సిటీ సమస్యలు ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. ఇది పట్టభద్రుల నియోజకవర్గానికి అత్యంత అవసరమైన అర్హత.

పట్టభద్రులు, నిరుద్యోగులకు అండ

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నుండి నేటి గ్రూప్-1, గ్రూప్-2, ఖూజ, ా×, కానిస్టేబుల్ నోటిఫికేషన్ల సాధన వరకు ప్రతీ ఉద్యమంలో ముందున్నారు. పేపర్ లీకేజీలపై, ఉద్యోగ జాప్యంపై ప్రభుత్వాలను నిలదీసిన గొంతుక.

వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల్లోని లక్షలాది మంది పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువతలో ఆయనకు వ్యక్తిగత పరిచయం, మంచి పేరు ఉంది. ఆయనకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ పార్టీ తప్పక గెలుస్తుంది. కావున, పెద్ద మనసుతో ఆలోచించి, 35 ఏళు ్లగా పార్టీని నమ్ముకుని సేవలందిస్తున్న, కాకతీయ యూనివర్సిటీలో ా+ పూర్తి చేసిన విద్యావంతుడు, పట్టభద్రుల ఆత్మబంధువు అయిన రాజనాల శ్రీహరి కి పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చి, మా గొంతుకను శాసన మండలిలో వినిపించేలా చేయగలరని కేయూ జాక్ టెక్నికల్ వింగ్ ఎక్స్ ప్రెసిడెంట్ వినోద్ లోక్ నాయక్, ఓయూ జాక్ వెంకట్ గల్లా వెంకట్ తదితరులు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన తండాలకు స్వయం పాలన

## బి.ఆర్.ఎస్ మర్పల్లి మండల ఎస్టి సెల్ అధ్యక్షులు జైసింగ్ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపిన గిరిజన బిడ్డలు

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధిమర్పల్లి మండలం, సెప్టెంబర్ 17(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన తండాలకు గ్రామపంచాయతీ హోదా కల్పించి, తండాల ప్రజలకు స్వయం పాలనకు బాటలు వేసిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారికి కృతజ్ఞతలు తెలుపుతూ మర్పల్లి మండలంలోని నర్సాపూర్ తండా, గుర్రం గట్టు తండా, షాపూర్ తండాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.



ఎన్నో ఏళ్లుగా తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలనే గిరిజనుల ఆకాంక్షను గుర్తించి, బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం ద్వారా గిరిజనుల చేతుల్లోనే స్థానిక పాలనను పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని అన్నారు.గతంలో తండాల ప్రజలు తమ చిన్నచిన్న అవసరాల కోసం కూడా దూరంలోని గ్రామపంచాయతీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదని,గ్రామపంచాయతీలుగా ఏర్పడిన తర్వాత స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారుమా తండా -- మా జెండా -- మా స్వయం పాలనమా తండా.. మా జెండా.. మా స్వయం పాలన" అనే నినాదంతో గిరిజనుల ఆత్మగౌరవాన్ని, స్థానిక పాలనా హక్కును బీఆర్ఎస్ ప్రభుత్వం బలోపేతం చేసిందని నాయకులు తెలిపారు.తండాలకు గ్రామపంచాయతీ హోదా రావడం కేవలం పరిపాలనా మార్పు మాత్రమే కాదని, అది గిరిజనుల ఆత్మగౌరవానికి, స్వయం పాలనకు గుర్తింపు అని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో గిరిజనుల విద్య, ఉపాధి, మౌలిక వసతులు, స్థానిక పాలన, సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారాని నాయకులు గుర్తుచేశారుగిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం నిలబడిన నాయకుడు కేసీఆర్" అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు



తండాలకు గ్రామపంచాయతీ హోదా రావడంతో స్థానిక పాలన ప్రజలకు మరింత చేరువైందని నాయకులు తెలిపారు. గ్రామపంచాయతీలకు పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు, స్థానిక అభివృద్ధి పనులు వంటి బాధ్యతలు ఉండటంతో తండాల అభివృద్ధికి కూడా సంస్థాగత మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు.తండాలకు గ్రామపంచాయతీ హోదా కల్పించి గిరిజనుల చేతుల్లో స్థానిక పాలనను పెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని నాయకులు అన్నారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు మాజీ సర్పంచ్ పీరియ నాయక్, బోయిన్ సుభాష్, సుమన్ ., లక్ష్మణ్ నాయక్, వెంకట్ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు

# సంక్షేమం సమతుల్య అభివృద్ధే లక్ష్యం



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబర్ 17:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించిన కేశవరావు, అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, తదితరులు ఆయనకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన అసమాన త్యాగాలు, పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాను ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు చేరవేయడంతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధిలో కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, అంగన్‌వాడీల నిర్వహణ, రేషన్ కార్డుల పంపిణీ, అభయహస్తం, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరా మహిళా శక్తి, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా, మహిళలు, చిన్నారుల భద్రత కోసం టీ-సేఫ్ యాప్ వంటి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి సంక్షేమం, సమతుల్య అభివృద్ధి లక్ష్యాలను సాకారం చేసుకోవాలని కేశవరావు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ కమిటీ సభ్యుడు జైపాల్ రెడ్డి, డీఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు



**జహీరాబాద్, సెప్టెంబర్ 17 ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 17 తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యమైన రోజని అన్నారు. ప్రజల ఐక్యత, సోదరభావం, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా ఈ రోజును ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతోపాటు రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేసిన ఉద్యమకారులు, అమరవీరులు, ప్రజల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, స్వాభిమానం, హక్కుల పరిరక్షణ కోసం బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీనవర్గాలు, మైనార్టీలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఐక్యత, ఆత్మగౌరవం, అభివృద్ధి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షుడు యాకూబ్, కౌన్సిలర్లు తంజీం అబ్దుల్లా, మహిపాల్, గౌస్‌గోరి, జాకీర్, పాండు, విశ్వేశ్వర్, ప్రవీణ్, దీపక్, నాయకులు జె. రవికిరణ్, బరూర్ దత్తాత్రి, గణేష్, చంద్రయ్య, ఫయాజ్, మొహమ్మద్ అలీ, ఇబ్రహీం, ఇంద్రారెడ్డి, విజయ్‌రాథోడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



**జహీరాబాద్, సెప్టెంబర్ 17 ప్రజాబలం ప్రతినిధి:** గిరిజనుల స్వయం పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జహీరాబాద్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. గిరిజనుల రిజర్వేషన్‌ను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడంతోపాటు తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో గిరిజన భవన్ ఏర్పాటు చేయడం, సంత్ సేవాలాల్ మహారాజ్ జెండా పండుగను అధికారిక రాష్ట్ర పండుగగా గుర్తించడం వంటి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు నాయకత్వంలో గిరిజనులకు అండగా నిలిచారని బంజారా నాయకులు అన్నారు. బంజారా భవన్ నిర్మాణానికి నూతన భవనం, ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, న్యాల్కల్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్, బంజారా నాయకులు గోపాల్, సంజీవ్ పవార్, హీరు రాథోడ్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, యువ నాయకులు, తండాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17 సందర్భంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



**అమీర్పేట్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) సెప్టెంబర్ 17** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నేడు రైసింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మణికంఠ మెడికల్ హాల్ వద్ద జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు బొడ్డు శ్రీనివాస్ గౌడ్, ఎల్లంకి కిరణ్ కుమార్ గౌడ్, బిక్షపతి గౌడ్, ప్రభు గౌడ్, బి. దశరథ్ గౌడ్, మల్లికార్జున గౌడ్, మురళి గౌడ్, నర్సింగ్ రావు, అమర్ గౌడ్, కొత్తపల్లి రాజు గౌడ్, బొడ్డు శ్రవణ్ కుమార్ గౌడ్, కిషోర్ గౌడ్, కె. గోపాల్, ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఆర్డీవో దేవుజ



**జహీరాబాద్, సెప్టెంబర్ 17 ప్రజాబలం ప్రతినిధి:** వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఆర్డీవో దేవుజ సూచించారు. గురువారం జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై సమీక్షించారు. వినాయక మండపాల నిర్వాహకులకు అవసరమైన సహకారం అందించాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్డీవో దేవుజ అధికారులను ఆదేశించారు. మండపాల కమిటీ సభ్యులు సైతం అధికారులకు సహకరించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ సైదా, తహసీల్దార్ దశరథ్, మున్సిపల్ చైర్మన్ యూనుస్, కమిషనర్ ప్రభాకర్, సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, పోలీస్ ,ఆర్అండ్‌బీ, విద్యుత్, మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వామపక్ష – ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక(ULDF)సదస్సును జయప్రదం చేయండి



**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** సెప్టెంబర్ 20న, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాదులో జరిగే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక (ULDF ) సదస్సును జయప్రదం చేయాలని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తేదీ. 17.9.2026న పత్రిక/ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బొజ్జ బిక్షమయ్య అధ్యక్షత వహించారు. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత యొక్క ప్రాధాన్యతను వివరించారు. దేశంలోని పాలకవర్గాలు దోపిడీతో ప్రజల ముందు బట్టబయలు అయ్యాయి. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అనివార్యమైందన్నారు.

జస్ట్ చంద్రకుమార్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి): మాట్లాడుతూ 80 ఏళ్ల స్వాతంత్రంలో ప్రజల దోపిడీ భారీగా పెరిగింది. బడా పెట్టుబడిదారుల 18.50 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారు. పెట్టుబడిదారులు ప్రభుత్వ బ్యాంకుల్లో రుణాలు ఎగ్గొడుతున్నారు. కౌలు రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. లక్షల మంది కాంట్రాక్టు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సమయానికి ఇవ్వడం లేదు. విద్య వైద్యం భారీ వ్యాపారం అయ్యింది. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. అవినీతి, కాలుష్యం, కల్తీ తారాస్థాయికి చేరింది. నిరుద్యోగం పెరిగింది. ఈ పాలకవర్గాలే ఈ దుస్థితికి కారణం.

నైనాల గోవర్ధన్ (వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు): దేశంలోని జాతీయ ప్రాంతీయ పార్టీలు వారి దోపిడీతో ప్రజలలో విపరీతమైన వ్యతిరేకత ఏర్పడింది. అధికారానికి వచ్చిన కేసీఆర్ భారీ అవినీతికి పాల్పడ్డారు. సుప్రీంకోర్టు జడ్జి అవినీతిని తేల్చినా చర్యలు తీసుకునే వారు లేరు. బిజెపి పెట్టుబడిదారుల సేవ చేస్తూ, యూపీఏ చెల్లింపుల పేరిట, అనేక రూపాల్లో భారీగా పన్నులు ప్రజలపై వేస్తుంది. రైతుల ఆదాయం రెండింతలు పెరగకపోగా మరింత దిగజారింది. సాలుకు రెండు కోట్ల నిరుద్యోగ హామీనీ ఉల్లంఘించి విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ అవినీతి దోపిడీలో కూరుకుపోయింది.

కోల జనార్ధన్ (వామపక్ష ప్రజాతంత్ర ఐక్య వేదిక నాయకులు): పాలకవర్గాలు ప్రజలకు ప్రత్యామ్నాయం కాదని, బహుజన సామాజిక శక్తులు వామపక్షాలతో ఐక్యం కావాలన్నారు. భౌగోళిక తెలంగాణ భూ కబ్జాల తెలంగాణ గా మారింది అన్నారు.

డాక్టర్ శ్రీనివాసరావు: (వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు) కమ్యూనిస్టులు ప్రజాతంత్ర శక్తులు మాత్రమే ప్రజల కొరకు నిలబడగలవు అన్నారు.

విజయ్ కుమార్ (వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు) అట్టడుగు వర్గాలని పాలకవర్గాలు మోసం చేస్తున్నాయని, వాడుకుంటున్నాయని, వామపక్షాలతో ఐక్యం కావడం మాత్రమే మార్గమన్నారు.

నాగయ్య (ఖూణ నాయకులు): ప్రజాతంత్ర శక్తులు, అశేష బాధిత ప్రజలందరూ వామపక్ష శక్తులతో ఐక్యం కావాలన్నారు.

డాక్టర్ నాగేశ్వరరావు (వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు): హాజరైన పాత్రికేయులకు నాయకులకు ధన్యవాదాలు చెబుతూ దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా విద్యార్థి యువజన కార్మికులందరూ ఐక్యం కావాలని ముగించారు. మల్లేష్ (రైతు సంక్షేమ సమితి), రహీం న్యాయవాది, ప్రభు (రైతు సంక్షేమ సమితి), సాయి కిరణ్ (రైతు సంక్షేమ సమితి), నరసింహా (రైతు సంక్షేమ సమితి) పాల్గొన్నారు.

# సత్తుపల్లి, వేంసూరులో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం..





**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 17:**భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంతో పాటు వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఎగురవేసి తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు.

సత్తుపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షుడు బానోతు విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కోరారు. నిజాం పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా స్మృతి వనాలు ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణ చరిత్రను ప్రతిబింబించే ప్రత్యేక చారిత్రక మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

జిల్లా కార్యదర్శి మున్నా మిశ్ర మాట్లాడుతూ నిజాం పాలనలో రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాటం చారిత్రాత్మకమని అన్నారు. 1948 సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు జరిగిన ఆపరేషన్ పోలో అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని ప్రతి ఏడాది సెప్టెంబర్ 17న స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో మండల బీజేపీ అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాల నాగ సురేంద్ర రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి యామవరపు అప్పారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బండి వెంకటరెడ్డి, బండి ఆంజనేయులు, సీనియర్ నాయకులు భీమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, దొడ్డపనేని కృష్ణయ్య, చల్లా అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలనాగ సురేందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ, మండల మాజీ అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, డాక్టర్ పెద్ది రాజు, సాయి, తొర్లపాటి సాయి యాదవ్, శివ, మన్నెం నరసింహమూర్తి, తెనాలి అశోక్, బండి ఆంజనేయులు, మంద సందీప్ తదితరులు పాల్గొన్నారు. వేంసూరు, కందుకూరు కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మర్పల్లి తెలంగాణ విమోచన దినోత్సవము సందర్భంగా జెండా ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ మధుగు రామేశ్వర్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 17 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఘనంగా జెండా ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ మధుగు రామేశ్వర్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సీనియర్ నాయకులు అధికారులుగ్రామ పుర ప్రముఖులు వార్డు మెంబర్లు యువకులు పెద్ద ఎత్తున జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవము జండా పండగను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా గ్రామ పెద్దలకు ప్రజలకు నాయకులకు యువకులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియపరుస్తున్నాను అని గ్రామ సర్పంచ్ మధుగు రామేశ్వర్ తెలిపారు

# హైదరాబాద్‌లో ప్రారంభమైన క్యూరాపాడ్ అనుభవ కేంద్రం.. సెప్టెంబర్ 16న ఆవిష్కరణ

## మహిళల పీరియడ్ నొప్పికి మందులు లేని వైద్య పరిష్కారం 'క్యూరాపాడ్ ఎం' ఆవిష్కరణ






హైదరాబాద్, సెప్టెంబర్ 16, 2026: మహిళల్లో పీరియడ్స్ సమయంలో ఎదురయ్యే నొప్పికి ఆధునిక, మందులు లేని పరిష్కారాన్ని అందించే లక్ష్యంతో రూపొందించిన క్యూరాపాడ్ ఎం వైద్య పరికరాన్ని హైదరాబాద్‌లోని ఐటీసీ కోహెనూర్‌లో ఆవిష్కరించారు. అదే సందర్భంగా మహిళలు ఈ పరికరం పనితీరును స్వయంగా అర్థం చేసుకునేందుకు రూపొందించిన క్యూరాపాడ్ అనుభవ కేంద్రాన్ని కూడా ప్రారంభించనున్నారు.

క్యూరాపాడ్ ఎం అనేది మహిళలు దుస్తుల కింద పొత్తికడుపు దిగువ భాగంలో ధరించగలిగే వైద్య పరికరం. ఇందులో మందులు లేదా హార్మోన్లు ఉండవు. ఈ పరికరం 30 నిమిషాల సెషన్లలో పనిచేస్తుంది. వినియోగం పూర్తయిన తర్వాత ఆటోమేటిక్‌గా ఆగిపోయే సదుపాయం ఇందులో ఉంది. ఎరుపు కాంతి, సమీప ఇన్‌ఫ్రారెడ్ కాంతి ఆధారిత కాంతి జీవసంబంధ మార్పిడి సాంకేతికతను ఉపయోగించి పీరియడ్ నొప్పికి సంబంధించిన వాపు, రక్తప్రసరణ వంటి అంశాలపై ప్రభావం చూపేలా దీనిని రూపొందించారు.

క్యూరాపాడ్ ఎంకు సీడీఎస్‌సీఓ అనుమతి, ఎఫ్‌డీఏ నమోదు ఉన్నట్లు సంస్థ తెలిపింది. ఈ పరికరాన్ని క్యూరాపాడ్ వెనుక ఉన్న లైట్మెడ్ బృందం భారత్‌లో తయారు చేసింది. లైట్మెడ్ గతంలో కండరాలు, కీళ్ల నొప్పుల కోసం క్యూరాపాడ్ అనే ధరించగలిగే వైద్య పరికరాన్ని అభివృద్ధి చేసింది.

కార్యక్రమంలో మహిళల ఆరోగ్యం, పీరియడ్ నొప్పి, క్యూరాపాడ్ ఎం వెనుక ఉన్న శాస్త్రీయ సాంకేతికత, ఆధునిక పీరియడ్ కేర్ వంటి అంశాలపై ప్రత్యేక చర్చ నిర్వహించనున్నారు. వైద్య విద్యావేత్త డాక్టర్ తనయ నరేంద్ర (డాక్టర్ క్యూటెరస్), వీ3 వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు అర్జున్ వైద్య, ఫౌంటెన్‌హెడ్ గ్లోబల్ స్కూల్ చైర్‌పర్సన్ మేఘనా మునునూరి ఈ చర్చలో పాల్గొననున్నారు.

క్యూరాపాడ్ అనుభవ కేంద్రంలో మహిళలు పరికరాన్ని ధరించి దాని సాంకేతికతను తెలుసుకోవడంతో పాటు, స్త్రీ వైద్య నిపుణుడిని వ్యక్తిగతంగా ప్రశ్నలు అడిగే అవకాశం కూడా కల్పించనున్నారు. ఈ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం అదే సాయంత్రం సందర్శకుల కోసం అందుబాటులో ఉంటుంది.

మరిన్ని వివరాలకు సంప్రదించండి: 9240031070

# సత్తుపల్లి సింగరేణిలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం..

## ఉత్పత్తి లక్ష్యాల సాధనకు క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలి: జీఎం ఎస్. వెంకటచారి



సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 17: తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ సత్తుపల్లి ఏరియాలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి స్పెషల్ ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకటచారి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జీఎం ఎస్. వెంకటచారి మాట్లాడుతూ ప్రజాపాలన దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, ఉద్యోగులు క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు.

కార్యక్రమానికి ఎస్ఓటూజీఎం బొల్లం శ్రీనివాసు అధ్యక్షత వహించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్. సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్‌ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు, సీఎంఓఏఐ సత్తుపల్లి ఏరియా అధ్యక్షుడు ఏ.ఎల్.ఎస్.వి. సునీల్ వర్మతో పాటు సత్తుపల్లి ఏరియా ఇంజనీర్, పర్చేస్ ఆఫీసర్, వివిధ గనులు, విభాగాల హెచ్ఓడీలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ వాది అయిన హమారా ప్రసాద్ ను అరెస్టు చేయాలి

## జోగిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 17 ప్రజాబలం సంగారెడ్డి జిల్లా: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్,బి.ఆర్, అంబేద్కర్, కల్పిత నాయకుడని, బుక్కు రాసిన దళిత ద్రోహి, మనువాది ఆర్ఎస్ఎస్ వాది అయినా నాగులారపు వరప్రసాద్ (అలియాస్) హమారా ప్రసాద్ ను, వెంటనే అరెస్టు చేయాలని, జోగిపేట పోలీస్ స్టేషన్ లో దళిత సంఘాల ఆధ్వర్యంలో జోగిపేట పోలీస్ స్టేషన్ ఎస్సై,గిరి, శ్రీకాంత్, కు కంప్లైంట్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు అందోల్ మల్లేశం, దళిత సంఘాల నాయకులు మొగులయ్య, మాజీ జెడ్పిటిసి బాయికాడి భూమయ్య, తలెల్మా కరుణాకర్, సంటినోళ్ల సంజీవయ్య, పుర్ర సంతోష్, ఎర్రోళ్ల నర్సింలు, పెండ గోపాల్, కోడెకల్ నర్సింలు, బేగరి ప్రసాద్, మన్నె పోచయ్య, మన్నె పరిపూర్ణం, మన్నె నాగేష్, మన్నె ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు....

# మానవత్వానికి సరిహద్దులు లేవు.. సత్తుపల్లి చిన్నారికి సాయం




సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 17: ఆపదలో ఉన్న ఓ చిన్నారి కోసం వేల మైళ్ల దూరంలో ఉన్నా ఓ మనసు స్పందించింది. బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న సత్తుపల్లికి చెందిన చిన్నారి ఛార్లెస్ ఫిన్నీ పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న అమెరికాలోని డల్లాస్‌లో నివాసం ఉంటున్న ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు కుమారుడు చల్లగుళ్ల నిఖిల్ వెంటనే స్పందించారు. చిన్నారి వైద్య చికిత్సకు తన వంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

చిన్నారి అనారోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న వెంటనే స్పందించి ఆర్థిక చేయూత అందించడం నిఖిల్ మానవతా దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది. భౌగోళికంగా దూరంగా ఉన్నప్పటికీ.. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలన్న తపనతో ముందుకు రావడం పలువురి ప్రశంసలు అందుకుంది.

వైద్య చికిత్స కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అవసరమైన సమయంలో అందే ప్రతి సహాయం ఎంతో విలువైనదే. నిఖిల్ అందించిన ఈ సాయం చిన్నారి చికిత్సకు తోడ్పాటుగా నిలవడంతో పాటు, మరికొందరు దాతలు కూడా ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందించేందుకు స్ఫూర్తిగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

దూరం ఎంత ఉన్నా.. మానవత్వంతో స్పందించే మనసుకు హద్దులు ఉండవు. ఆపదలో ఉన్న చిన్నారి కోసం స్పందించి ఆర్థిక సహాయం అందించిన చల్లగుళ్ల నిఖిల్కు అభినందనలు తెలిపారు.

బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి ఛార్లెస్ ఫిన్నీ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తున్నారు.

# గుంతమర్పల్లిలో నూతన మంజీరా పైప్‌లైన్ ప్రారంభం



జహీరాబాద్, సెప్టెంబర్ 17 ప్రజా బలం ప్రతినిధి: ఝరసంఘం మండలం గుంతమర్పల్లి గ్రామంలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన మంజీరా తాగునీటి పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ గురువారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సర్పంచ్ ప్రియాంక నరసింహగౌడ్ కృషితో పైప్‌లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, తట్టు నారాయణ, రవీందర్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమానికి కేసీఆర్ కృషి



జహీరాబాద్, సెప్టెంబర్ 17 ప్రజాబలం ప్రతినిధి: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బంజారా, గిరిజనుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని బీఆర్ఎస్ ఐటీ విభాగం నాయకుడు సంజీవ్ పవర్ తెలిపారు. తండాలు, గూడేలను గ్రామపంచాయతీలుగా మార్చి స్వపరిపాలనకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆసరా, మిషన్ భగీరథ, పల్లె ప్రగతి, హరితహారం, మన ఊరు--మన బడి వంటి పథకాలతో తండాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు అందించడంతో గిరిజన రైతులకు భరోసా కల్పించారని తెలిపారు. సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు బంజారా భవన్, ఆదివాసీ భవన్ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. గిరిజన మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే పదవులు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని సంజీవ్ పవర్ అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు.

# తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ

## జెండా ఆవిష్కరించిన సర్పంచ్ స్వప్న సురేందర్ గౌడ్

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 17



(ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా : పుల్కల్ మండల పరిధిలో గలఎస్,ఇటిక్యాల, గ్రామపంచాయతీ ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని, గ్రామ సర్పంచి స్వప్న సురేందర్ గౌడ్, జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ,సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్, యువజన సంఘాల నాయకులు గ్రామ పారిశుద్ధ కార్మికులు, తదితరులు పాల్గొనడం జరిగింది,.

# కట్టే పాడు తండాలో ఘనంగా సేవాలాల్ యూత్ వినాయక పూజలు



వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 17(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం కట్టే పాడు తాండలో సేవాలాల్ యూత్ పట్లూర్ తండా నాలుగు రోజు గణేష్ పూజలు కంప్లీట్ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది పూజా కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో వినయంగా పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు పూజా కార్యక్రమంలోసునీల్ ,అనిల్ ,వినోద్,గణేష్ ,శ్రవణ్ ,బబ్లు,మహేష్, మరియు యువకులు భక్తిశ్రద్ధలతో గణపతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నట్టు యువ నాయకుడు ప్రజా క్షేమం కోరే సునీల్ తెలిపారు

# ఏసీబీ కోర్టుకు మాజీ మంత్రి కారుమూరి

విజయవాడ : మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావును సిట్ అధికారులు ఏసీబీ కోర్టుకు తీసుకువచ్చారు. 'మద్యం రవాణా టెండర్లలో అక్రమాల కేసు'లో కారుమూరి నాగేశ్వరరావు నిందితుడిగా వున్నారు. పీటీ వారెంట్పై కారుమూరి నాగేశ్వరరావును హైదరాబాద్ చంచల్గూడ జైలు నుంచి విజయవాడకు తరలించారు. మద్యం రవాణా టెండర్లలో అక్రమాల కేసులో ఇప్పటికే కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అధికారులు అరెస్టు చేసారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బాలానగర్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ



**కూకట్పల్లి (ప్రజాబలం ) సెప్టెంబర్ 17:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలానగర్ డివిజన్‌లోని పిజెఆర్ విగ్రహం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ విమోచన దినోత్సవం మన చరిత్రలో ఎంతో ప్రత్యేకమైన రోజు. తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవాలి. దేశ సమైక్యత, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుంది అని అన్నారు.అనంతరం జాతీయ జెండాకు వందనం చేసి, దేశ సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ-బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, బాలానగర్ డివిజన్ అధ్యక్షులు శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫుల్ శ్రీకాంత్ పటేల్, రామ్మోహన్ రావు, శివ ,ప్రసన్నకుమార్, మధుమోహన్ ,మహేందర్,ప్రకాష్ ముదిరాజ్, క్రాంతి, ముస్తఫా, మద్దూరు రాము, పాల్గొనరావు, చంద్రావు, రమణ, సాయి, భారతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుక ప్రత్యేక పూజలు నిర్వహించిన మండల కమిటీ.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 17:** భారత ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదిన వేడుకలు తల్లాడ బిజెపి పార్టీ అధ్యక్షులు చల్లా నాగులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తల్లాడ పట్టణ పరిధిలోని శివాలయం నందు బోడి పేరు మీద అర్చన కార్యక్రమం నిర్వహించి నరేంద్ర మోడీ ప్రధానిగా ఎన్నో సేవలు భారత ప్రజలకు అందించాలని పూజలు



నిర్వహించారు. అనంతరం పట్టణ పరిధిలోని పలు గణేష్ మండపాల వద్ద పూజా కార్యక్రమంలో నిర్వహించి గణనాథుడు ఆశీస్సులు నరేంద్ర మోడీకి ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చల్ల నాగులు, ప్రధాన కార్యదర్శి లు రాయల రమేష్, పెరిక కిరణ్, మండల ఉపాధ్యక్షురాలు వేము రజిత, జిల్లా కౌన్సిల్ మెంబర్ శారద, మాజీ కిషన్ మోర్చా అధ్యక్షులు రామారావు, ఉపాధ్యక్షులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజా పాలనదినోత్సవం సందర్భంగా పట్లూర్ లోజాతీయ జెండా ఆవిష్క రించిన సర్పంచ్ పరుశురాం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి (ప్రజాబలం ) సెప్టెంబర్ 17:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్లూర్ గ్రామపంచాయతీలోజాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్, గ్రామ సర్పంచ్ పరుశురాం జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ విమోచన దినోత్సవం మన చరిత్రలో ఎంతో ప్రత్యేకమైన రోజు. తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవాలి. దేశ సమైక్యత, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుంది అని అన్నారు.అనంతరం గ్రామ సర్పంచ్ పరుశురాం మాట్లాడుతూజాతీయ జెండాకు వందనం చేసి, దేశ సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, గ్రామ సర్పంచ్ పరుశురాం , ఉపసర్పంచ్ అఖిల్, పట్లూర్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ రాకేష్ ,సెక్రెటరీ గోపాల్, వార్డు మెంబర్లు మరియు గ్రామ పెద్దలు మాజీ ఎంపిటిసి సురేష్, మహేష్, రాజు, జి నర్సింలు,గ్రామ పెద్దలు యువకులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున జండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు

# బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన తండాలకు స్వయం పాలన స్వాతంత్రం

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపిన గిరిజన బిడ్డలు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధిమర్పల్లి మండలం, సెప్టెంబర్ 17(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం నర్సాపూర్ పెద్ద తండా నూతన గ్రామపంచాయతీలో ఘనంగా కెసిఆర్ పాలాభిషేకం నిర్వహించినట్టు విలేజ్ బి.ఆర్.ఎస్ పార్టీ ప్రెసిడెంట్ రాంసింగ్ మరియు యువ నాయకుడు గోపాల్ ఉపసర్పంచ్ మోహన్ తెలిపారు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన తండాలకు



గ్రామపంచాయతీ హోదా కల్పించి, తండాల ప్రజలకు స్వయం పాలనకు బాటలు వేసిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారికి కృతజ్ఞతలు తెలుపుతూ మర్పల్లి మండలంలోని, నర్సాపూర్ పెద్ద తండాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఎన్నో ఏళ్లుగా తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలనే గిరిజనుల ఆకాంక్షను గుర్తించి, బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం ద్వారా గిరిజనుల చేతుల్లోనే స్థానిక పాలనను పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని అన్నారు. గతంలో తండాల ప్రజలు తమ చిన్నచిన్న అవసరాల కోసం కూడా దూరంలోని గ్రామపంచాయతీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదని,గ్రామపంచాయతీలుగా ఏర్పడిన తర్వాత స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారుమా తండా -- మా జెండా -- మా స్వయం పాలన"మా తండా మా జెండా.. మా స్వయం పాలన" అనే నినాదంతో గిరిజనుల ఆత్మగౌరవాన్ని, స్థానిక పాలనా హక్కును బీఆర్ఎస్ ప్రభుత్వం బలోపేతం చేసిందని నాయకులు తెలిపారు. తండాలకు గ్రామపంచాయతీ హోదా రావడం కేవలం పరిపాలనా మార్పు మాత్రమే కాదని, అది గిరిజనుల ఆత్మగౌరవానికి, స్వయం పాలనకు గుర్తింపు అని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో గిరిజనుల విద్య, ఉపాధి, మౌలిక వసతులు, స్థానిక పాలన, సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారాని నాయకులు గుర్తుచేశారుగిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం నిలబడిన నాయకుడు కేసీఆర్" అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారుతండాలకు గ్రామపంచాయతీ హోదా రావడంతో స్థానిక పాలన ప్రజలకు మరింత చేరువైందని నాయకులు తెలిపారు. గ్రామపంచాయతీలకు పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు, స్థానిక అభివృద్ధి పనులు వంటి బాధ్యతలు ఉండటంతో తండాల అభివృద్ధికి కూడా సంస్థాగత మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు. తండాలకు గ్రామపంచాయతీ హోదా కల్పించి గిరిజనుల చేతుల్లో స్థానిక పాలనను పెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని యువ నాయకులు నర్సాపూర్ పెదతాండ విలేజ్ ప్రెసిడెంట్ రాంసింగ్, యువ నాయకుడు గోపాల్, ఉప సర్పంచ్ మోహన్, మరియు గ్రామ పెద్దలు యువకులు నాయకులు పాలాభిషేక కార్యక్రమంలో పాల్గొని సమావేశాన్ని విజయవంతంగా పూర్తి చేశారని నర్సాపూర్ తాండ యువ గోపాల్ ,రాకేష్, లాల్ సింగ్, వాల్య నాయక్, గ్రామ పెద్దలు యువకులుబి.ఆర్.ఎస్ విలేజ్ పార్టీ ప్రెసిడెంట్ రాంసింగ్ తెలిపారు

# సిరిసిల్ల నడిబొడ్డున మువ్వన్నెల జెండాకు అవమానం

## అధికారులు నిద్రపోతున్నారా.. లేక చట్టాలను మూలన పడేశారా?

## అధికారులను నిలదీస్తున్న సిరిసిల్ల ప్రజలు!





**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 17 ,(ప్రజాబలం ప్రతినిధి)**జాతికి అత్యంత పవిత్రమైన రోజైన ప్రజా పాలన దినోత్సవం నాడే సిరిసిల్ల నడిరోడ్డుపై దేశ ఆత్మగౌరవానికి ఘోర అవమానం జరిగింది. ఏటా లక్షల రూపాయల ప్రజాధనాన్ని జీతాలుగా తీసుకుంటున్న జిల్లా యంత్రాంగం, నిబంధనలు అమలు చేయాల్సిన పోలీసులు అసలు ఏం చేస్తున్నారు? సిరిసిల్ల చౌరస్తాలో ఒక రాజకీయ పార్టీ (బిఆర్ఎస్) జెండా కట్టెకు దిగువ భాగాన జాతీయ జెండాను కట్టి ఎగరవేస్తుంటే అధికారుల కళ్లు మూసుకుపోయాయా? చట్టాలు కేవలం సామాన్యుడిపై ప్రతాపం చూపించడానికేనా?అధికారులూ.. ఈ ప్రశ్నలకు మీ దగ్గర సమాధానం ఉందా? కళ్లముందే చట్టం ఉల్లంఘిస్తుంటే ఏమైంది మీ ప్రొటోకాల్?"భారత జాతీయ జెండా ప్రవర్తనా నియమావళి (ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా)" ప్రకారం ఏ ఒక్క రాజకీయ పార్టీ లేదా సంస్థ జెండా కూడా జాతీయ జెండా కంటే ఎత్తుగా ఉండకూడదు. ప్రతీ వీధిలో తిరిగే పోలీసులు, నిఘా వర్గాలు, రాకపోకలు సాగించే ఉన్నతాధికారులకు ఈ ఘోర అపచారం కనబడలేదా? పార్టీ జెండా కింద జాతీయ జెండా కడితే చూడటానికి మీ మనసెలా ఒప్పేసింది? పార్టీ జెండా ముందే ఎగిరి ఉంటే, దానికి సరిసమానంగా లేదా ఎత్తుగా వేరే కర్రను ఏర్పాటు చేయాలన్న కనీస స్పృహ నిర్వాహకులకు లేదు. పోనీ చూస్తూ ఊరుకున్న అధికారులకైనా ఆ బాధ్యత లేదా?

చట్టం ఏం చెబుతోంది? అధికారులు ఎందుకు కేసు నమోదు చేయట్లేదు?

"జాతీయ గౌరవానికి విఘాతం కలిగించే నిరోధక చట్టం, 1971" ప్రకారం జాతీయ జెండాను తక్కువ గౌరవంతో ప్రదర్శించడం లేదా అవమానించడం క్షమించరాని నేరం. ఈ నేరానికి 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. జెండాను ఏర్పాటు చేసిన స్థానిక పార్టీ నాయకులు, ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడంలో విఫలమైన బాధ్యులపై పోలీసులు వెంటనే సుమోటోగా కేసు నమోదు చేయాలి. వారిపై ఉక్కుపాదం మోపాలి.రాజ్యాంగం ఇచ్చిన పదవుల్లో ఉంటూ జాతీయ పతాక గౌరవాన్ని కాపాడలేకపోయిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.దేశ సార్వభౌమాధికారాన్ని దిగజార్చేలా ప్రవర్తించిన నిర్వాహకులను వెంటనే అరెస్ట్ చేయకపోతే, అధికారుల తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని సిరిసిల్ల పౌర సమాజం తీవ్ర ఆగ్రహంతో హెచ్చరిస్తోంది!

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com